# హైదరాబాద్ వార్త



## ఆన్‌లైన్ షాపింగ్.. జాగ్రత్త

**మోసాలపై అప్రమత్తత అవసరం**



- ధరల తేడాల్లో కనిపెట్టకపోతే నష్టాలే
- ఆకర్షణీయమైన ప్రకటనలు,ఆఫర్లు నమ్మితే అంతే

హైదరాబాద్, ఆగస్టు 1, ప్రభాతవార్త: ఆన్‌లైన్ షాపింగ్‌పై నేడు అన్ని వర్గాలవారు పెద్దపెత్తున ఆసక్తి కపబరుస్తున్నారు. ఆన్‌లైన్‌లో రకరకాల ఆకర్షణలు, ఆఫర్లతో కొనుగోలుదార్లను ఇట్టే అదరగొడుతున్నారు. షోరూంలలో కనిపించని వస్తువులు అనేకం ఆన్‌లైన్ షాపింగ్‌లో దర్శనమిస్తున్నాయి. నెట్‌లో కనిపించే ఆన్‌లైన్ షాపింగ్ ప్రకటనలన్నీ నమ్మేస్తే మనం మోసపోవడం కాయం. ప్రచారంలో చెప్పేదిఒకటి తీరా ఆర్డర్ ఇవ్వగానే ధరల్లో తేడాలు కనిపిస్తుంటాయి. దీని గురించి తిరిగి ఎవరిని సంప్రదించాలో తెలియని పరిస్థితి ఎదురవుతుంది. ఆన్‌లైన్ షాపింగ్‌లో చాలా తక్కువ ధరలకే వివిధ రకాల ఉత్పత్తులను ఉంచుతున్నారు. ప్రత్యేకించి ఎలక్ట్రానిక్స్ ఎలక్ట్రికల్ ఉత్పత్తులతో పాటు ఫర్నీచర్, రెడిమేడ్ డ్రెస్సెస్, కాస్మోటిక్స్,స్మార్ట్‌ఫోన్‌లు ఇలా అనేక రకాల ఉత్పత్తులు ఇప్పుడు ఆన్‌లైన్ ద్వారా షాపింగ్ చేసేందుకు అవకాశం ఉంటుంది. ఆర్డర్ ఇచ్చిన కొద్దిరోజుల్లోనే వాటిని డోర్‌డెలివరీ చేస్తున్నారు. ఇంట్లో కూర్చొని మనకు కావాల్సిన వస్తువులు హాయిగా కొనుగోలు చేసేస్తున్నాము. చూడ్డానికి వినడానికి ఇదంతా బాగానే ఉన్నా.. కొన్ని సందర్భాల్లో ఆన్‌లైన్ షాపింగ్ చేసేవారు మోసపోతున్నారు. ఆర్డర్ ఇచ్చిన వస్తువులు ఇంటికి రాగాని వాటిని చూసి అవాక్కయినవారూ చాలా మంది ఉన్నారు. టీవీల్లోనూ, ఇంటర్‌నెట్‌లోనూ ఎక్కడ చూసినా అన్‌లైన్ షాపింగ్ ఆకర్షణీయమైన ప్రకటనలు కనిపిస్తుంటాయి. చాలా తక్కువ ధరకే వాటిని ఇస్తున్నట్లు ప్రకటిస్తారు. దీంతో చాలామంది ఆకర్షితులవుతున్నారు. దేశవిదేశాల కంపెనీలు అనేకం ఆన్‌లైన్ ద్వారా వ్యాపారాలు చేస్తూ కొను గోలు దార్లను ఆకట్టుకుంటున్నాయి. ఆన్‌లైన్ షాపింగ్‌లో అత్యధికంగా గృహోపకర ణాలు, ఫర్నీచర్, ఎలక్ట్రానిక్ ఉత్పత్తులు, రెడిమేడ్ దుస్తులు అధికంగా ఉంటున్నాయి. వీటిని ఆకర్షణీయమైన ధరలతో ప్రకటనలు చేస్తుంటారు. డిస్కౌంట్‌లు ,ఒకటికొంటే మరొకటి ఉచితం ,డోర్‌డెలివరీ వంటి ఆఫర్లను చూసి పూర్తిగా నమ్మేసి షాపింగ్ చేయడం సరికాదు. ఆకర్షణీయమైన ప్రకటనలు చేసే కంపెనీలలో కొన్ని బోగస్‌వి కూడా ఉంటున్నాయి.ఇటీవల కాలంలో ఓవినియోగదారుడు ఆన్‌లైన్‌లో మొబైల్‌ఫోన్ ఆర్డర్ చేస్తే.. ఇంటికి వచ్చిన ప్యాకెట్‌ను ఇప్పిచూస్తే బొమ్మఫోన్‌లు, రాళ్లు వచ్చినసంఘటనలు అనేకంగా ఉన్నాయి.

**ఆన్‌లైన్ షాపింగ్ చేసేటప్పుడు గమనించాల్సిన విషయాలు**

మనం కొనుగోలు చేసే కంపనీ వివరాలు ముందే తెలుసుకొని సదరు కంపెనీ ఎలాంటి ఉత్పత్తులపై వ్యాపారం చేస్తుందో గమనించాలి.ఆన్‌లైన్‌లో విక్రయించే వస్తువులకు,షాపింగ్ మాల్స్‌లో లభించే వాటికి ధరల్లో ఏమైనా తేడాలు ఉనా న్నయా లేదా తెలుసుకోవాలి.బోగస్ కంపెనీల గురించి తరుచూ పత్రికల్లోకానీ పోలీసులు గానీ చెబుతుంటారు వాటిని పరిశీలించండి. ఆన్‌లైన్ మోసాలపై చర్యలు తీసుకునేందుకు పోలీసులు ప్రత్యేక సైబర్ క్రైం విభాగాన్ని ఏర్పాటు చేసింది. ఏమైనా అనుమానాలు ఉంటే ఈవిభాగానికి ఫిర్యాదు చేయవచ్చు.ఆన్‌లైన్ వ్యాపారాలు నిర్వహిస్తున్న కంపెనీలకు సంబంధించిన ఫోన్‌నెంబర్లు దగ్గర ఉంచుకొని వాటి అడ్రస్ గూర్చి కూడా తెలుసుకోవాలి. ఆన్‌లైన్ వ్యాపారంలో అమ్మే వస్తువులు ప్యాకింగ్‌పై కంపెనీల చిరునామాలు,ఎప్పుడు తయారయ్యే గమనించాలి.

## చాదర్‌ఘాట్‌లో పర్యటించిన జస్టిస్ చంద్రయ్య



**మూసానగర్‌లో పర్యటిస్తున్న రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ ఛైర్మన్ జస్టిస్ చంద్రయ్య**

మలక్‌పేట, ఆగస్టు 1 ప్రభాతవార్త : చాదర్‌ఘాట్ మూసానగర్, వవిన నాయక వీధి, మూసి పరివాహక ప్రాంతాలలో తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ ఛైర్మన్ జస్టిస్ చంద్రయ్య పర్యటించారు. వరద బాధితులతో మాట్లాడి సహాయక చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఇళ్ల పరిసరా ల్లో పేరుకుపోయిన చెత్త, చెదారాన్ని సత్వరమే తొలగించడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సహాయక చర్యల్లో ప్రజలు సహకరించాలని కోరారు. అదే విధంగా ఓల్డ్ మలక్‌పేట శంకర్‌నగర్‌లోని మూసీ ప్రాంతంలో ఆయన సందర్శించి పరిస్థితులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అంబర్‌పేట తహసీల్దార్ లలిత, చాదర్‌ఘాట్ ఇన్‌స్పెక్టర్ సతీష్, ఎస్‌ఐ ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ కుటుంబ సభ్యులకు తీగల పరామర్శ



**చంద్రబాబుతో మాట్లాడుతున్న హైదరాబాద్ మాజీ మేయర్ తీగల కృష్ణారెడ్డి**

సరూర్‌నగర్, ఆగస్టు 1 ప్రభాతవార్త: తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ సిఎం ఎన్టీఆర్ నాలుగవ కూతురు ఉమా మహేశ్వరి మృతి పట్ల హైదరాబాద్ నగర మాజీ మేయర్, మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన జూబ్లిహిల్స్‌కు తరలివెళ్లి అక్కడ ఎన్టీఆర్ కుటుంబ సభ్యులను అదే విధంగా మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిని కలిసి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ మేరకు తీగల నందమూరి కుటుంబంతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకొన్నారు.

# పెరిగిన కార్గో సేవల ఆదాయం

**ఇప్పటికే ఆర్టీసీకి 8200 కోట్ల మేరకు నష్టాలలో ఉండగా ఇందులో సుమారుగా రూ. 4000 కోట్ల మేరకు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనే నష్టాలు చవి చూసినట్లు అధికారులు తెలిపారు.**

**గ్రేటర్‌లో రోజుకు రూ. 10 లక్షలు**
**పార్సిల్ ఆదాయం గతంలో రూ. 5 లక్షలే**
**ఆదాయం పెంచుకోవడంపైనే దృష్టి**

హైదరాబాద్, ఆగస్టు 1 ప్రభాతవార్త : పెరిగిన కార్గో సేవలతో గ్రేటర్ హైదరాబాద్‌లో ఆర్‌టిసి ఆదాయం గణనీయంగా పెరిగింది. కార్గో సేవలను ప్రజలకు అందుబాటులోకి తేవడంతో పాటు ప్రస్తుతం తమ సంస్థలో ఉన్న తమ సిబ్బందిని తగ్గించుకోవడం ద్వారా ఆదాయాన్ని పెంచుకునేందుకు గ్రేటర్ హైదరాబాద్ ఆర్‌టిసి సంస్థ యత్నిస్తోంది. ఇప్పటికే గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఇతర జిల్లాలతో తమకు పెద్ద నెట్ వర్క్ ఉందని దీనిని వినియోగించుకోవడం ద్వారా నష్టాలను భారీగా తగ్గించుకునే ఛాన్స్ ఉందని ఆర్‌టిసి సంస్థ చెబుతోంది. గ్రేటర్ హైదరాబాద్ పరంగా చూస్తే ఒక్క కార్గో సేవల ద్వారానే రోజుకు పది లక్షల ఆదాయం సమకూరుతోందని గ్రేటర్ హైదరాబాద్ ఆర్‌టిసి మేనేజర్లు చెబుతున్నారు. గతంలో కార్గో ద్వారా కేవలం రూ. 5 లక్షల వరకే సమకూరేదని, ప్రజల నుండి క్రమంగా నమ్మకం పెంచుకోవడం ద్వారా కార్గో సేవలు విస్తరించాయని చెబుతున్నారు. వివిధ జిల్లాలకు ప్రతి రోజూ కార్గో సేవలను చేపట్టామని, క్రమంగా నెల నెలా సేవలను విస్తరిస్తూ ఇప్పటికే రోజుకు రూ 10 లక్షలకు పెరిగిందని చెబుతున్నారు. ఆర్‌టిసికి ఆదాయం తీసుకురావడంలో ఇతర జిల్లాలతో గ్రేటర్ పోటీ పడుతోందనే చెప్పవచ్చు. ఒక్క కార్గో సేవల విషయానికే వస్తే ఈ ఆదాయం రాష్ట్రవ్యాప్తంగా చూసుకుంటే రోజుకు రూ. 40 లక్షలకు తగ్గకుండా వస్తోందని గతంలో ఈ మెత్తం కేవలం 20 వేల లోపునే ఉండేదంటున్నారు. వినియోగదారుడు ఇష్టాలకు అనుగుణంగా సేవలందించేందుకు యత్నిస్తూనే ఆదాయాన్ని పెంచుకోవడం, టెక్నాలజీని అందిపుచ్చుకోవడం అలాగే నష్టాలను తగ్గించుకోవడం ద్వారా ఆర్‌టిసిని గాడిలోకి తీసుకువచ్చేందుకు ఈ చర్యలు దోహదపడతాయని ఆర్‌టిసి ఉన్నతాధికారులు చెబుతున్నారు.

**ఆదాయం పెంచుకొవడంపైనే దృష్టి..** గ్రేటర్ హైదరాబాద్ పరంగా ఐదు నెలల్లో దాదాపు 400 మంది వరకు ఆర్‌టిసి ఉద్యోగులు పదవీ విరమణ పొందుతున్నారు. ఇది ఆర్‌టిసి సంస్థకు ఆదాయం పరంగా కాస్త ఊరటగానే చెప్పవచ్చు. సాధారణంగా సిబ్బంది తగ్గే కొద్దీ మిగతా వారిపై పని భారం పెరిగి ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతాయి. కానీ ఆర్‌టిసిలో పరిస్థితి మాత్రం అందకు కాస్త



భిన్నంగానే ఉంటుం దని చెప్పవచ్చు. ఇక్కడ సిబ్బంది సంఖ్య తగ్గే కొద్దీ నష్టాలు భారీగా తగ్గుముఖం పడుతాయి. దీంతో తాజాగా జరుగుతున్న పదవీ విరమణలు ఆర్‌టిసి నష్టాలను తగ్గించబోతున్నాయి. ఆర్‌టిసి గత నెలలో 150 మంది వరకు పదవీ విరమణ పొందారు. గత జూన్ నెలలో రాష్ట్రవ్యాప్తంగా 315 మంది రిటైర్ అయ్యారు. ఇందులో ఒక్క గ్రేటర్ హైదరాబాద్‌లోనే 170 మంది వరకు ఉన్నారు. ఈ జూలై నెలలోనూ మరో 150 మంది రిటైర్ అయ్యారు. జూలై ఆగస్టు మాసాలు కలిపి రాష్ట్ర వ్యాప్తంగా 380 మంది వరకు రిటైర్డ్ కాబోతుండగా అందులో గ్రేటర్ హైదరాబాద్ ప్రాంత వాసులే 210 మంది వరకు ఉంటుండడం గమనార్హం. ఇలా వెరసి మే నెల నుండి సెప్టెంబర్ మాసం వరకు సంస్థలో దాదారు వెయ్యి మంది వరకు రిటైర్డ్ కానుండగా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనే 400 పైచిలుకు ఉండడం గమనార్హం. కాగా ప్రస్తుతం ఆర్‌టిసి ఖర్చుల్లో అతిపెద్ద వాటా జీతాలదే కానుండడం గమనార్హం. మొత్తం వ్యయంలో జాతీల వాటా దాదాపు 53 శాతంగా ఉంది. చాలా మంది ఆర్టసి ఉద్యోగులు కోరనప్పటికీ తెలంగాణ ఆవిర్భావం తర్వాత 2015 నుండి కూడా ప్రభుత్వం 44 శాతం ఫిట్‌మెంట్‌ను ప్రకటించింది. అలా జీతాల భారం సంస్థకు భారీగా పెరుగుతూ వస్తోంది. ముఖ్యమంత్రి కెసిఆర్ తీసుకున్న ఆ నిర్ణయంతో సంస్థపై ప్రతి నెలా రాష్ట్రవ్యాప్తంగా రూ. 850 కోట్ల మేరకు పడుతుండగా సాలీనా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 400 కోట్ల వరకు పద్దు సంస్థకు అదనంగా పెరిగింది. అలాగే ఆ తర్వాత 16 శాతం వరకు రింటీరియమ్ రిలీఫ్‌ను కూడా సిఎం కెసిఆర్ అమలులోకి తేవడంతో సంస్థపై అదనపు భారం పడిపోయింది. మొత్తంగా జీతాల భారం అదనంగా రూ. 400 కోట్ల మేరకు అదనమైంది. ఇలా చూసుకుంటే నెలకు సగటున వంద కోట్ల పై చిలుకు సిబ్బంది జీతాల కోసమే వెచ్చించాల్సి వస్తోంది. దీనికి తోడు 2019 లో ఆర్‌టిసిలో సమ్మె ముగిసిన వెంటనే 1500 వరకు బస్సులను సంస్థ తగ్గించుకుంది. ఆ తర్వాత కాలం చెల్లిన మరో 200 బస్సుల వరకు తుక్కు పేరుతో తొలగించుకుంది. ఫలితంగా దాదాపు 1000 మంది సిబ్బంది వరకు పని లేకుండా పోయింది. అయితే జీతాలను మాత్రం సంస్థకు ఖచ్చితంగానే ఇవ్వాల్సిన పరిస్థితి నెలకొంది.

దీంతో తాజాగా వీరిని కార్గో విభాగం ఆర్‌టిసి పెట్రోల్ బంకుల్లో చిన్న చిన్న పనులు అప్ప జెప్పటం ప్రధాన బస్టాపుల్లో ప్రైవేటు బస్సులను నిలుపుదల చేయకుండా కొందరికి పనులు అప్పగించి విధుల్లో కొనసాగించుకుంటోంది. కాగా ఆర్‌టిసి సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు పదవీ విరమణ వయస్సును మరో రెండేళ్ల పాటు పెంచడం తదితర నిర్ణయాలతో ఆర్‌టిసిపై మరింత భారం పడింది. 2019 డిసెంబర్ నుండి 2021 నవంబర్ మాసం వరకు కూడా ఉద్యోగుల పరవీ విమరణలు లేకుండా పోయాయి. గత డిసెంబర్ నెల నుండి పదవీ విరమణలు మొదలు కావడంతో సంస్థ భారం తగ్గుతూ వస్తోంది. ఏతా వాతా గతంతో పోలిస్తే ఆర్‌టిసి నష్టాల సంఖ్య బాగా తగ్గిపోయింది. గత నెల నుండి గ్రేటర్ హైదరాబాద్‌లో కొన్ని డిపోలు లాభాల బాటప ట్టాయి. ఈ తరుణంలో 400 మంది ఉద్యోగుల జీతాల పద్దు తగ్గితే సంస్థకు అంత మేరకు నష్టాలు తగ్గినట్లేనని ఆర్‌టిసి కార్పొ రేషన్ యాజమాన్యం ఒకింత సంబరపడుతోంది. గత కొన్ని మాసాలుగా ఆర్‌టిసి సంస్థ నష్టాలను నుండి ఎలా బయట పడాలా అంటూ మధన పడుతూ వస్తోంది.

## రసరమ్యం జనరంజకం శ్రీయ కూచిపూడి రంగప్రవేశం



రవీంద్రభారతి, ఆగస్టు 1 ప్రభాతవార్త : మాతృదేశం, భాష, భారతీయ శాస్త్రీయ కళలు, పుట్టిన తెలుగుగడ్డపై ప్రేమాభిమానాలతో అమెరికాలో ఉన్నత విద్యనభ్యసిస్తూ కూడా ఎంతో పట్టుదల అంకితభావంతో కూచిపూడి నృత్యాన్ని చిన్ననాటి నుండి అభ్యసించిన ప్రముఖ నాట్యగురువు శైలజ ప్రసాద్ శిష్యురాలు పి.శ్రీయ ఈరోజు జాతీయ కళావేదిక రవీంద్రభారతి ప్రధాన మందిరంలో పలు కూచిపూడి నృత్యాంశాలను రసరమ్యం జనరంజకంగా ఎంతో అలవోకగా ప్రదర్శించి రంగప్రవేశంలోనే తన ప్రతిభను చాటుకుని విచ్చేసిన అశేష ప్రేక్షకులకు కనులపండుగ చేసింది. శ్రీయ ముందుగా సౌరాష్ట్ర రాగం ఆదితాళంలో త్యాగరాజ కీర్తనతో రంగ ప్రవేశాన్ని ప్రారంభించి మోహనరాగం కందచాపు తాళంలో శివాష్టకం, తదుపరి కామాక్షిస్తుతి, భామాకలాపం (ప్రవేశ దరువు), నారాయణ తీర్థులవారు స్వరకల్పన చేసిన తరంగం, అన్నమాచార్య కీర్తన, అనంతరం జావళి, చివరిగా తిల్లానా తదితర అంశాలను అమి తోత్సాహంతో శృతి లయబద్ధంగా ప్రదర్శించి ఆహుతులను మంత్ర ముగ్ధులను చేసింది.

## 20 బుల్లెట్ మోటార్ సైకిళ్లు.. 40 మంది రైడర్లు

**హైదరాబాద్ - న్యూ ఢిల్లీ మోటార్ సైకిల్‌ర్యాలీని ప్రారంభించిన దక్షిణమధ్య రైల్వే**



హైదరాబాద్ ఆగస్టు 1 ప్రభాతవార్త : దక్షిణ మధ్య రైల్వే రక్షక దళం ఆధ్వర్యంలో హైదరాబాద్ - న్యూ ఢిల్లీ మోటార్ సైకిల్ ర్యాలీ ప్రారంభమైంది. 'ఆజాదీకా అమృత్ మహోత్సవ్' ఉత్సవాలలో భాగంగా దక్షిణ మధ్య రైల్వే , రక్షక దళం హైదరాబాద్ నుండి న్యూ ఢిల్లీకి మోటార్ సైకిల్ ర్యాలీని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ ( ఇంఛార్జీ ) అరుణ్ కుమార్ జైన్ సోమవారం నాడు నెక్లెస్ రోడ్ రైల్వే స్టేషన్‌లో జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఇన్స్‌పెక్టర్ జనరల్ ఎస్‌సిఆర్ చీఫ్ సెక్యూరిటీ రాజా రామ్, సికింద్రాబాద్ డివిజన్ డిఆర్‌ఎం ఏకే గుప్తా, హైదరాబాద్ డివిజన్ డిఆర్‌ఎం శరత్, చంద్రాయన్ పాల్గొన్నారు.

**భారతీయ రైల్వేలోని 5 జోన్లు..** ఈస్ట్ కోస్ట్ రైల్వే, ఆగ్నేయ కేంద్ర రైల్వే, దక్షిణ రైల్వే నైరుతీ రైల్వేతో పాటు దక్షిణ మధ్య రైల్వే జోన్లకు చెందిన ఆర్‌పిఎఫ్ రైడర్లు ఈ యాత్రలో పాల్గొంటున్నారు. ఈ ర్యాలీకి దక్షిణ మధ్య రైల్వే ఆతిథ్యం వహిస్తుంది. నెక్లెస్ రోడ్డు రైల్వే స్టేషన్ నుంచి 40 మంది రైడర్లు 20 బుల్లెట్ మోటార్ సైకిళ్లపై న్యూ ఢిల్లీకి బయలుదేరారు. వీరిలో ఆర్‌పిఎఫ్‌కు చెందిన ఇద్దరు మహిళా రైడర్లు కూడా ఉండడం విశేషం. 1700 కి.మీ దూరం సాగే ఈ యాత్ర తెలంగాణ, మహారాష్ట్ర, మధ్య ప్రదేశ్, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాల మీదుగా వెళ్తుంది. తమ యాత్రలో రైడర్లు స్వాతంత్ర్య సమరాన్ని గురించి మరియు స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న అమృత్ మహోత్సవ సందేశాన్ని చాటుతారు. ఈ ర్యాలీ న్యూ ఢిల్లీలోని నేషనల్ పోలీస్ మెమోరియల్ వద్ద ముగుస్తుంది. కాగా ఆజాదీకా అమృత్ మహోత్సవ్ ఉత్సవాల నిర్వహణలో దక్షిణ మధ్య రైల్వే అగ్రభాగాన ఉంది. ఇందుకు ముందు ఎస్‌సిఆర్ రైల్వే రక్షణ దళం 28 జులై 2022 నాలుగు డివిజన్లకు చెందిన 46 మంది రైడర్లతో 23 బైకులపై 34 జిల్లాల మీదుగా 2977 కిలో మీటర్ల మోటార్ సైకిళ్ల యాత్రను జయప్రదంగా నిర్వహించారు. దారి మధ్యలో ఉన్న ముఖ్యమైన స్టేషన్లలో వారిని సన్మానించారు. ప్రజలు భారీ సంఖ్యలో ఈ వేడుకలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎస్‌సిఆర్ జనరల్ మేనేజర్ (ఇంఛార్జ్) అరుణ్ కుమార్ జైన్ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరంతో రైల్వేలకు సన్నిహిత సంబంధం ఉందన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలోనూ కీలక పాత్ర పోషించిందన్నారు. అనంతరం ఇన్స్‌పెక్టర్ జనరల్ ఎస్‌సిఆర్ చీఫ్ సెక్యూరిటీ కమిషనర్ రాజా రామ్ ఈ సందర్భంగా మాట్లాడుతూ 1700 కిలో మీటర్ల కఠినమైన యాత్రలో పాల్గొంటున్న ఆర్‌పిఎఫ్ బైక్ రైడర్లను ప్రశంసించారు.

## మౌలిక వసతులు కల్పించడమే ప్రభుత్వ ధ్యేయం : మంత్రి తలసాని



**పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్**

ఎస్‌ఆర్‌నగర్, ఆగస్టు 1 ప్రభాతవార్త : ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాలు, వసతులను కల్పించమే ప్రభుత్వ ధ్యేయమని, సనత్‌నగర్ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నట్లు రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, పాడిపరిశ్రమల అభివృద్ధి, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. సోమవారం సనత్‌నగర్‌లో 1.52కోట్ల రూపాయల విలువైన పలు అభివృద్ధి పనులను భారీ వర్షంలోనే ప్రారంభించారు. ముందుగా బికెగూడ వార్డ్ ఆఫీస్ వద్ద 49.20లక్షల రూపాయల వ్యయంతో, దాసారం బస్తీ కమిటీ హాల వద్ద 35లక్షల వ్యయంతో, జెక్ కాలనీలో ఎస్‌బిఐ బ్యాంక్ వద్ద 68 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టనున్న విడిసిసి రోడ్డు నిర్మాణ పనులను మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే తమ లక్ష్యమని, అందుకు ఎన్ని నిధులైనా ఖర్చు చేసేందుకు ప్రభుత్వం వెనుకాడబోదని స్పష్టం చేశారు. రోజురోజుకు పెరిగిపోతున్న ట్రాఫిక్ రద్దీకి అనుగుణంగా నియోజకవర్గ పరిధిలోని అన్ని రహదారులను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. అంతేకాకుండా ఫుట్‌పాత్‌ల నిర్మాణం, సీవరే జ్‌లైన్, వాటర్‌పైప్‌లేన్ వంటి అనేక అభివృద్ధి పనులు నియోజకవర్గం పరిధిలో జరుగుతున్న విషయాన్ని గుర్తు చేశారు. ఎన్నో సంవత్సరాలుగా పరిష్కారానికి నోచుకోని పలు సమస్యలను తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తరువాత పరిష్కరించినట్లు తెలిపారు. తమ దృష్టికి వచ్చిన ప్రతీ సమస్యలను ఎప్పటికప్పు డు పరిష్కరించేలా చర్యలు తీసు కుంటున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో సనత్‌నగర్ డివిజన్ కార్పోరేటర్ కొలన్ లక్ష్మీబాల్‌రెడ్డి, జోనల్ కమీషనర్ రవి కిరణ్, ఈఈ ఇందిర, వాటర్‌వర్క్స్ జిఎం హరిశంకర్, ఏఎంహెచ్‌ఓ భార్గవ నారాయణ, జెక్ కాలనీ అసోసియేషన్ ప్రెసిడెంట్ సూర్యశంకర్‌రెడ్డి, సభ్యులు సురేష్‌గౌడ్, టిఆర్‌ఎస్ సీనియర్ నాయకులు సరాఫ్ సంతోష్, రాజేష్‌ముదిరాజ్, పుష్పలత, పురుషోత్తం పాల్గొన్నారు.

## సాదాసీదాగా కంటోన్మెంట్ బోర్డు సమావేశం

**పలు అంశాలపై తీర్మానించిన బోర్డు అధ్యక్షుడు**



**కంటోన్మెంట్ బోర్డు పాలకమండలి సమావేశంలో బ్రిగేడియర్ సోమశంకర్, బోర్డు సభ్యుడు రామక్రిష్ణ, సిఈఓ అజిత్‌రెడ్డి**

కంటోన్మెంట్, ఆగస్టు 1 ప్రభాతవార్త: సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పాలకమండలి సమావేశం సదా సీదాగా కొనసాగింది. కంటోన్మెంట్ బోర్డు అధ్యక్షుడు బ్రిగేడియర్ కె.సోమశంకర్ అధ్యక్షతన జరిగిన బోర్డు సమావేశంలో సిఈఓ అజిత్ రెడ్డి, సివిలియన్ నామినేటెడ్ మెంబర్ జె.రామక్రిష్ణ, డిప్యూటీ సిఈఓ విజయ్ కుమార్ బాలన్ నాయర్‌ల సమక్షంలో జరిగిన పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించి తీర్మాణించారు. బిల్డింగ్ అనుమతులకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రర్ చేసుకోవాలని తీర్మాణించారు. బోర్డు పరిధిలో 60 చదరపు గజాల స్థలాల్లో భవన నిర్మాణం చేపట్టేందుకు ఎలాంటి అంక్షలు లేకుండా అనుమలు ఇవ్వాలని బోర్డు నిర్ణయించింది. వరద నీటి ప్రవాహానికి ధ్వంశమైన నాలా పరివాహక ప్రాంతాలను అభివృద్ధిపనులు వేగవంతం చేయాలన్నారు. రెసిడెన్షియల్, కమర్షియల్ టాక్స్‌లను పెంచేందుకు నిర్ణయించారు. కంటోన్మెంట్ బోర్డు బొల్లారం ఆసుపత్రిలో ఆర్తోకార్డియాలోజీ, ఇఎన్‌టీ,చర్మ వ్యాధులు వంటి విభాగాల డాక్టర్లను ఏర్పాటు చేయుటకు తీర్మాణించారు. నందమూరినగర్‌లో బస్తీ దావఖానను ఏర్పాటు చేయుటకు,డోర్‌టూ డోర్ చెత్త సేకరణ ట్యాక్స్‌లపై, బిల్డింగ్ అనుమతుల్లో స్టిల్,షెల్లార్, బేస్‌మెంట్, ఫ్లోర్ వంటి అనుమతులకు ట్యాక్స్‌లను విధించారు. అదే విధంగా పబ్లిసిటీ కోసం ప్రధాన చౌరస్తాలలో ఏర్పాటు చేససే హోర్డింగ్‌ల, ఫ్లెక్సీల అనుమతులపై చర్చించారు. అదే విధంగా కమర్షియల్ షాప్‌లకు 28 శాతం, రెసిడెన్షియల్ ఇండ్లకు 2.4 శాతం ఛార్జీలను పెంచాలని బోర్డు నిర్ణయించింది. టోల్ ట్యాక్స్‌పై, కంటోన్మెంట్ బోర్డుకు కావాల్సిన వాహనాల కొనుగోలుపై తీర్మాణించారు. ఈ కార్యక్రమంలో ఇంజనీర్లు సి.హెచ్.ఉమా శంకర్, దినేశ్ తదితరులు పాల్గొన్నారు.

## అటు వాన.. ఇటు ఎండ

- హైదరాబాద్‌లో భిన్న వాతావరణం
- పలు కాలనీలు జలమయం



బేగంపేట్‌లో...



హైదరాబాద్ ఆగస్టు 1 ప్రభాతవార్త : సోమవారం ఉదయం ఒక్క సారిగా మళ్లీ భారీ వర్షం కురిసింది. ఉదయం ఎండ కొట్టినప్పటికీ క్రమంగా మబ్బులు కమ్ముకోవడంతో వాతావరణం ఒక్క సారిగా మారి పోయింది. ఈ కారణంగా అమీర్‌పేట, కూకట్‌పల్లి, మూసాపేట, సోమాజీగూడ, పంజాగుట్ట, బోయిన్‌పల్లి, ఖైరతాబాద్, ఎర్రమంజిల్, నాంపల్లి, ఆబిడ్స్ కోఠి, బషీర్‌బాగ్ నారాయణగూడ, రామంతాపూర్, సికింద్రాబాద్, తార్నాక, ఉప్పల్, మలక్‌పేట తదితర ప్రాంతాలలో భారీగా వర్షం పడింది. ఈ కారణంగ ఆయా ప్రాంతాలలోని కాలనీలు జలమయం అయ్యాయి. ఉదయం ఎనిమిది గంటలకే మొదలైన ఈ వాన చినికి చినికి గాలి వాన అన్నట్లు ఒక్క సారిగా పెరిగింది. దీంతో హైదరాబాద్ నగరంలో పలు ప్రాంతాలన్నీ జలమయం అయ్యాయి. ప్రధాన మార్గాలలో రోడ్లపైకి భారీగా నీరు చేరడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. పలు ప్రాంతాలలో పెద్ద ఎత్తున వాహనాలు నిలిచిపోయాయి. కాగా మధ్యాహ్నం సమయంలో కొన్ని చోట్ల వర్షం కాస్త వెరసిన తర్వాత మళ్లీ ఒక్క సారిగా ఎండ కాచింది. వాన నీళ్లు కొన్ని చోట్ల తెరిపినివ్వగా మరి కొన్ని చోట్ల వరదలా పారింది. ఓ వైపు వాన.. మరో వైరో సారి ఎండ కాయడంపై పలువురు చర్చించుకోవడం గమనార్హం.

## గుండ్లపోచంపల్లిలో వ్యక్తి దారుణ హత్య

పేట్‌బషీరాబాద్, ఆగష్టు 1 ప్రభాతవార్త : బండరాయితో మోది హత్య చేసిన సంఘటన సోమవారం పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మహరాష్ట్రకు చెందిన ఏ.బాబు (40) గుండ్లపోచంపల్లిలో లేబర్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం సాయంత్రం ఇంటి నుంచి బయటకి వెళ్లిన వ్యక్తి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో కంగారు పడిన కుటుంబ సభ్యులు చుట్టుపక్కల, బం ధువుల ఇంటి వద్ద వెతికి చూడగా ఎక్కడా కనిపించలేదు. సోమవారం కుటుంబ సభ్యులు, బంధువులు మరోసారి గాలించగా గుండ్లపోచమ్మ మల్లన్న గుడి వద్ద శవమై కనిపించడంతో పేట్ బషీరాబాద్ పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులకు గుర్తు తెలియని వ్యక్తులు బాబు తలపై బండ రాయితో మోది హత్య చేశారని కుటుంబసభ్యులు తెలిపారు. క్లూస్ టీంతో వివరాలు సేకరించి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

## ఆడపిల్లలు పుట్టారని భార్యను వెళ్లగొట్టిన భర్త

సైదాబాద్, ఆగస్టు 1 ప్రభాతవార్త: ఆడపిల్లలు పుట్టారని భార్యను ఇంట్లో నుంచి గెంటి వేసిన సంఘటన సైదాబాద్‌లో జరిగింది. సైదాబాద్ లోకాయుక్త కాలనీకి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ శ్రీకాంత్ వివాహం స్వప్నతో 2014లొ జరిగింది. ఆరేళ్ల క్రితం ఆడపిల్ల పుట్టడంతో ఇంటి నుంచి వెళ్లగొట్టారు. అయితే కుటుంబ పెద్దలు జోక్యం చేసుకుని రాజీ కుదిర్చారు. ఆరు నెలల క్రితం కవల పిల్లలు పుట్టారు. దీంతో మరోసారి ఆడపిల్ల పుట్టడంతో వేధింపులకు గురిచేయడం ప్రారంభించాడు. పుట్టిం టి నుంచి 20 తులాల బంగారం తీసుకురావాలని ఇంటి నుంచి బయటకు వెళ్లగొట్టాడు. దీంతో బాధితురాలు తన ముగ్గురు పిల్లలతో భర్త ఇంటి ముందు దీక్షకు దిగింది.

# ప్రజలు ఎల్లప్పుడు సుఖసంతోషాలతో జీవించాలి

**కంటోన్మెంట్, ఆగస్టు 1, ప్రభాతవార్త :** ప్రజలు ఎల్లప్పుడు సుఖసంతోషాలతో ఆరోగ్యంగా జీవించాలని అమ్మవారిని వేడుకున్నట్లు అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ టిటి.పద్మారావు గౌడ్ తెలిపారు. కంటోన్మెంట్ 3వ వార్డు బాలంరాయిలో కాంగ్రెస్ నేత బి.ఏ.ప్రమోద్ కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి నిర్వహించిన పలహారం బండి ఊరేగింపుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. గత 25 సంవత్సరాల నుంచి బాలంరాయిలో బోనా లు, పలహారం బండి ఊరేగింపు ఘనంగా నిర్వహిస్తున్నందుకు ప్రమోదు కుమార్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు దండుగుల యాదగిరి, ప్రముఖ సినీనటుడు సలీమ్, నిర్మాత మహవీర్‌జైన్, సినీగాయకుడు రాహుల్, మాజీ ఎంపీ హన్మంత్‌రావ్, టిఆర్ఎస్ యువనాయకుడు రామేశ్వర్ గౌడ్, అనీల్ యాదవ్, అంబర్‌పేట్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.


పలహారం బండి ఊరేగింపులో పాల్గొన్న డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్

# లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
## - కార్పొరేటర్ సామలహేమ

**సికింద్రాబాద్, ఆగస్టు 1, ప్రభాతవార్త :** ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో లోతట్టు ప్రాంతాలు, నాలా పరివాహక ప్రాంతాలలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, అందరు జాగ్రత్తగా ఉండాలని సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామలహేమ అన్నారు. సోమవారం ఉదయం కురిసిన వార్షంతో లోతట్టు, నాలా పరివాహక ప్రాంతంలోని నివాసాల్లోకి వరదనీరు చేరాయి, బస్తీలలోని రోడ్లపై చెత్తచెదారం నిండిపోయి స్థానిక ప్రజలు ఇబ్బందులు పడ్డారు. వెంటనే స్పందించిన కార్పొరేటర్ అన్నానగర్, మహ్మద్‌గూడ, షాబాద్‌గూడ తదితర ప్రాంతాలలో అధికారులతో పాటు పర్యటించి సమస్యలను పరిష్కరించారు. ఈ సందర్భంగా ఆమే మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న కారణంగా మ్యాన్‌హోల్‌లు, ఇతర నీటి ప్రవాహానికి సంబంధించిన మూతలు తెరువకూడదని తెలిపారు. అత్యావసరంగా సేవలు అందించడానికి జీహెచ్‌ఎంసీ అధికారులు, సిబ్బంది సిద్దంగా ఉన్నారని చెప్పారు. ఎక్కడైనా వరదనీరు నిలిచిన పక్షంలో జీహెచ్‌ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసినా, సమాచారం అందించినా తక్షణమే చర్యలు తీసుకుంటారని తెలిపారు. ఏ సమయంలోనైనా తనకు ఫోన్ చేసినా వెంటనే సమస్య పరిష్కారం కోసం అందుబాదులో ఉంటానని పేర్కొన్నారు. కార్పొరేటర్ తనఫోన్ నెంబరు, అధికారుల నెంబర్‌లను ఇక్కడి ప్రజలకు తెలిపారు. ఈ కార్యాక్రమంలో ఏఈ కౌశిక్, టీఆర్ఎస్ నేతలు జాకీర్, కుమార్, రహీంపాషా, లక్ష్మీలు పాల్గొన్నారు.


మహ్మద్‌గూడలో పర్యటిస్తున్న సామలహేమ

# దశాల వారిగా అభివృద్ధి పనులు చేపడుతాం

**అడ్డగుట్ట, ఆగస్టు 1, ప్రభాతవార్త :** అడ్డగుట్ట డివిజన్‌లోని వివిధ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను దశల వారిగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని అడ్డగుట్ట డివిజన్ కార్పొరేటర్ లింగాని ప్రసన్న శ్రీనివాస్, తెలిపారు. సోమవారం ఆజాద్ చంద్రశేఖర్ నగర్‌లో పర్యటించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. బారీ వర్షాలు వచ్చినప్పుడు వరదనీరు సాఫీగా పోయేందుకు తగు చర్యలు తీసుకోవాలని వారి దృ ష్టికి తెచ్చారు. వరదనీరు సాఫీగా పోయేందుకు శాశ్వత మరమ్మత్తులు చేపట్టేందుకు ప్రతిపాధనలు సిద్ధం చేసినట్లు తెలిపారు. జిహెచ్‌ఎంసి ఇంజనీర్లు, ఆశా లత, పద్మలత, వేణు, గ్రంథాలయ డైరెక్టర్ లింగాని శ్రీను, టిఆర్ఎస్ నాయకులు పెండెం మనోహార్, నరేశ్, బస్తీ నాయకులు చిన్నా, పరశరామ్ తదితరులు పాల్గొన్నారు.


సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ లింగాని

# హౌసింగ్‌బోర్డు కాలనీ పార్కును సందర్శించిన ఎమ్మెల్యే కాలేరు

**హైదరాబాద్, ఆగస్టు 1, ప్రభాతవార్త :** అంబర్‌పేట్ పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ సోమవారం కాచిగూడ డివిజన్‌లోని బర్కపురా హౌసింగ్‌బోర్డు కాలనీ పార్కును సందర్శించారు. ఈసందర్భంగా పార్కు అభివృద్ధి, ఇతర సంబంధిత అంశాలపై అసోసియేషన్ సభ్యులతో కలిసి చర్చించి మరో సారి పూర్తి స్థాయి సమీక్షా సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. రానున్న వినాయకచవితి పండుగ నేపథ్యంలో అక్కడ ఉన్న పాతషెడ్డు స్థానంలో కొత్తషెడ్డు ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అలాగే కాలనీలో కుక్కలబెడద ఉందని, ఇతర సమస్యలను కాలనీవాసులు దృష్టికి తీసుకురాగా సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే తగిన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. ఈకార్యక్రమంలో టిఆర్ఎస్ నేత దిడ్డిరాంబాబు, కాలనీవెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.


అసోసియేషన్ సభ్యులతో మాట్లాడుతున్న కాలేరు

# ఎన్నారై సేవా ఫౌండేషన్ సేవలు అభినందనీయం
## రచయిత తనికెళ్ల భరణి, సింగర్ సునీత

**హైదరాబాద్, ఆగస్టు 1,ప్రభాతవార్త :** ఎన్నారై సేవా ఫౌండేషన్ సేవలు అభినందనీయమని రచయిత, నటుడు తనికెళ్ల భరణి, సింగర్ సునీతా అన్నారు. ఈమేరకు సోమవారం నగరంలో జరిగిన కార్యక్రమంలో ఎన్నారై సేవా ఫౌండేషన్ 10వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. దీనికి తనికెళ్లభరణితోపాటు, సింగర్ సునీత ముఖ్య అతిధులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మనదేశంలో ఉన్న పేదవారితోపాటు, విదేశాల్లో ఉన్న తెలుగువారికి నిస్వార్థంగా సేవ చేయడం గొప్పవిషయం అన్నారు. ఈసందర్భంగా ఫౌండేషన్ నిర్వాహకులు వారిని ఘనంగా సన్మానించారు. కాగా ఎన్నారై ఫౌండేషన్‌ని హారీశ్ కొలసాని స్థాపించారు. ఆయన ఆధ్వర్యంలో గత కొంతకాలంగా అమెరికాతోపాటు, తెలుగు రాష్ట్రాల్లో విద్యా,వైద్యం, మహిళలకు ఉద్యోగ అవకాశాలు వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. అలాగే బంజారాహిల్స్, మేడ్చల్, కూకట్‌పల్లి ప్రాంతాల్లోని పేదలు,వయేధికులకు వైద్య సేవలు, పిజియోథెరపితోపాటు ,పలు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న ఫేషెంట్లు అటెండర్లకు ఆహారం ఏర్పాట్లు చేస్తున్నారు.


తనిళ్ల భరణి, సునీతను సన్మానిస్తున్న దృశ్యం

# తెలుగు సాహిత్యంలో కథలకు ప్రత్యేక స్థానం ఉంది
## - బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు

**చిక్కడపల్లి, ఆగస్టు 1, ప్రభాతవార్త :** తెలుగు సాహిత్యంలో కథలకు ప్రత్యేక స్థానం ఉందని తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణ మోహన్‌రావు అన్నారు. కలహంస ఆర్ట్ అండ్ సత్కళాభారతి, త్యాగరాయ గానసభ సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ కవి, భారత్ కళారత్న డాక్ట ర్ వడ్డేపల్లి కృష్ణ రచించిన 'మర్యాదరామన్న కథ లు' గ్రంథావిష్కరణ సభ ఆదివారం రాత్రి చిక్క డపల్లి శ్రీ త్యాగరాయ గానసభలోని కళాసు బ్బా రావు కళావేదికలో త్యాగరాయ గానసభ అధ్యక్షుడు కళావిఎస్.జనార్దనమూర్తి అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ వకుళాభరణం కృష్ణ మోహన్‌రావు మాట్లాడుతూ జాతీయ కవి వడ్డేపల్లి కృష్ణ రచించిన 'మర్యాదరామన్న కథలు' నీతి బోధకాలని, పిల్లలకు ఆసక్తి కలిగే విధంగా కథనం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతిభా పురస్కారాలను ప్రసిద్ధ కవి, రచయిత, దాశరథి పురస్కారగ్రహీత డాక్టర్ తిరుమల శ్రీనివాసాచార్యకు, సంగీత స్వరకర్త డాక్టర్ ఎం.చిత్తరంజన్‌కు అందించి గౌరవించారు. కార్యక్రమంలో నేటినిజం పత్రిక ఎడిటర్ బైసాదేవదాస్, బాలసాహిత్య పురస్కారగ్రహీత దాసరి వెంకటరమణ, వనం నరసింహారావు, గంజి సత్యనారాయణ పాల్గొన్నారు. తొలుత కవి సమ్మేళనంలో మాధవి, లలిత, పెద్దూరి వెంకటదాసు, రఘువీర్ ప్రతాప్, పోతూరి సుబ్బారావు, వసుంధర స్వీయ కవితలను చదివారు.


'మర్యాదరామన్న కథలు' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు

# పంద్రాగస్టుకు అంతా సిద్ధం : ప్రముఖుల హాజరు

**ఖైరతాబాద్, ఆగస్టు 1, ప్రభాతవార్త :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల, రాజకీయ పార్టీల వారు, సేవా సంస్థలు, పలు అసోసియేషన్‌లు, పోలీస్ స్టేషన్లు, బస్తీల, కాలనీలలో రాబోయే పంద్రాగస్టుకు అందరూ అంతా సిద్ధం చేసుకున్నారు. ప్రధాన కూడల్లు, పలు చౌరస్తాల వద్ద ప్రముఖులు, మాజీ మంత్రి ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, మాజీ ఎంపి అంజన్ కుమార్ యాదవ్, కార్పొరేటర్ పి.విజయారెడ్డి, మాజీ ఎంఎల్ఎ చింతల రాంచంద్రారెడ్డి ప్రబృతులు హాజరై పంద్రాగస్టు వేడుకల్లో పాల్గొంటారని వారి అనుయాయులు పేర్కొంటున్నారు. మరోవైపు జాతీయ బ్యాంకులు, ఆర్‌బిఐ, తపాలా కార్యాలయం, వాటర్ వర్క్స్, బల్దియా విద్యుత్, ఆర్ అండ్ బి పోలీస్‌స్టేషన్లు, పాఠశాలలు 75వ సంవత్సరాలు పూర్తి కావస్తున్నందున వారంతా ఘనంగా జరుపుకునేందుకు శ్రీకారం చుడుతున్నారు.

# గౌడకులస్తుల సమస్యల పరిష్కారానికి త్వరలో భారీ బహిరంగ సభ
### ఏకులానికి ఎంతబడ్జెట్ కేటాయించిందో ప్రభుత్వం బయటపెట్టాలి
### గౌడసంఘాల ఐక్యకార్యచరణ కమిటీ డిమాండ్


సమావేశంలో మాట్లాడుతున్న నర్సాగౌడ్

**హైదరాబాద్, ఆగస్టు 1, ప్రభాతవార్త :** రాష్ట్ర గౌడకులస్తుల సమస్యల పరిష్కారానికి త్వరలో హైద రాబా ద్‌లోని నిజాంకా లేజీ గ్రౌండ్‌లో భారీ బహిరంగసభను నిర్వ హిస్తామని అలాగే రా ష్ట్ర ప్రభుత్వబడ్జెట్‌లో ఏకులానికి ఎంత కేటా యించిందో భయటపె ట్టాలని తెలంగాణ గౌడ సం ఘాల ఐక్యకార్యా చరణ కమిటీ చైర్మన్ అమరవేణి నర్సాగౌడ్, వర్కింగ్ చైర్మన్ బూర మ ల్సూర్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు నగరంలోని జేఏసీ కార్యాల యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కల్లుగీత కార్మికులు, గౌడకులస్తుల సమస్యల పరిష్కారానికి తెలంగాణ గౌడసంఘాల జేఏసీ విస్త్రతస్థాయి సమావేశాలు నిర్వహించి రాష్ట్రంలోని 40లక్షల గౌడకులస్తులను పార్టీలకు అతీతంగా ఐక్యం చేసి హైదరాబాద్‌లో భారీ బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం పాపన్నగౌడ్ జయంతి, వర్ధంతి వేడుకలను అధికారికంగా నిర్వహించాలని అలాగే జనగాం జిల్లాకు పాపన్నగౌడ్ పేరు పెట్టాలన్నారు. అంతేకాకుండా కల్లుగీత కార్పొరేషన్ ఏర్పాటు చేసి పూర్తిస్థాయి కార్యవర్గాన్ని ప్రకటించాలన్నారు. వైస్ చైర్మన్ పటేల్ వెంకటేష్‌గౌడ్, రాగుల సిద్దిరాములుగౌడ్, జనగాం వెంకటేష్‌గౌడ్, బాలసాని సురేష్‌గౌడ్ పాల్గొన్నారు.

# ఎమ్మార్పీఎస్ నేతల రిలే నిరాహార దీక్షలు

**మెహిదీపట్నం, ఆగస్టు 1, ప్రభాతవార్త :** వర్షాకాల పార్లమెంటు సమావేశాల్లోనే ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ బిల్లుకు చట్టబద్దత కల్పించాలని కోరుతూ సోమవారం కార్వాన్ నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ నేతలు లంగర్‌హౌస్ డివిజన్ అంబేద్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాల వద్ద రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్ హైదరాబాద్ జిల్లా కన్వీనర్ బుషిపాక గణేష్ హాజరై మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వ అధికారంలోకి వస్తే 100 రోజుల్లో ఎస్సీ వర్గీకరణ చేస్తామని మాట ఇచ్చిందని గుర్తు చేశారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8 సంవత్సరాలు గడుస్తున్నా వర్గీకరణ చేయకపోవడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్దత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ దీక్షలు ఈనెల 12వ తేదీ వరకు కొనసాగుతాయని తెలిపారు. దీక్షలో ఎమ్మార్పీఎస్ నాయకులు వి.ఎస్.రాజు, సత్తయ్య, సానం ప్రకాష్, చంద్రమోహన్, నవీన్, జగన్, శైలేందర్‌లు ఉన్నారు.

# సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 1, ప్రభాతవార్త :** ప్రజావాణిలో వచ్చిన సమస్యలను సత్వరమే పరిష్కరించటానికి చర్యలు చేపట్టటం జరుగుతుందని మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ జాన్ శ్యాంసన్ పేర్కొన్నారు. సోమవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణి కార్యక్రమం జరిగింది. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి వినతులను ఆయన స్వీకరించారు. జిల్లా వ్యాప్తంగ కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో 32వినతులు ప్రజల నుంచి అందినట్లు తెలిపారు. ఈ సందర్భంగ జిల్లా అదనపు కలెక్టర్ జాన్ శ్యాంసన్ మాట్లాడుతూ ప్రజల సమస్యలు సత్వరమే పరిష్కరించటానికి సంబంధిత జిల్లా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. వీటికి సంబంధించి అవసరమైన తగు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులు శాఖల వారీగ వచ్చిన వినతులు,ఫిర్యాదులు, ధరఖాస్తులు వంటి వాటి గురించి తెలుసుకుని పరిష్కరించాలని అధికారులకు సూచించారు. వినతుల పట్ల సంబంధిత అధికారులు వెంటనే స్పందించాలన్నారు. ఏమైనా వినతులు తిరస్కరించినట్లైతే వాటికి గల కారణాలను కూడ తెలియజేయాలన్నారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి
## - ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్

**మెహిదీపట్నం, ఆగస్టు 1, ప్రభాతవార్త :** కార్వాన్ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి వాటిని త్వరగా అందుబాటు లోకి తీసుకురావాలని స్థానిక ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం టోలీచౌకి మెరాజ్ కాలనీలోనిపార్టీ కార్యాలయంలో స్థానిక కార్పొరేటర్లతో పాటు వివిధ విభాగాలకు చెందిన అది టకారులతో సమావేశం నిర్వహించి అభివృద్ధి పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నాలాల పూడికతీత పనులు, ఎస్‌పి3, ఎస్‌పి2 పైప్‌లైన్, ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రహదారుల మరమత్తులు, తక్కువగా సరఫరా అవుతున్న తాగునీరు. విద్యుత్, కలుషిత జలాల సమస్యలు ఎక్కడ ఉన్నా వెంటనే పరిష్కరించాలన్నారు. అభివృద్ధి పనులు జరుగుతున్న బస్తీలు, కాలనీలలో స్థానికులచే ఏవైనా సమస్యలుంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వార మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. సమావేశంలో కార్పొరేటర్లు మహ్మద్ నసీరుద్దీన్, వజీ ఉజ్జమా సిద్దికి, మహ్మద్ హరాన్‌ఫరాన్, మహ్మద్ బదూరుద్దీన్, జీహెచ్‌ఎంసీ కార్వాన్ - 13 సర్కిల్ డిప్యూటీ కమిషనర్ నర్సింహ్మా అధికారులు శివానంద్, రామ్ క్రిష్ణ, శంకర్, కామేశ్వరి, ఉదయ్, శ్రీకాంత్, జవహార్ అలీ, వెంకటేష్, సాజిద్‌లు ఉన్నారు.


అధికారులతో సమావేశమైన ఎమ్మెల్యే కౌసర్

# రైల్ నిలయం అంబేద్కర్ నగర్‌లో ఘనంగా ముగిసిన బోనాల ఉత్సవాలు

**కంటోన్మెంట్, ఆగస్టు 1, ప్రభాతవార్త :** కంటోన్మెంట్ నియోజకవర్గం మోండా డివిజన్ అంబేద్కర్ నగర్‌లో ప్రసిద్ధిగాంచిన శ్రీ నల్లపోచమ్మ దేవాలయంలో బోనాలు, పలహారం బండి ఊరేగింపు ఉత్సవా లు ఘనంగా ముగిశాయి. తెలంగాణ రాష్ట్ర మెడికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్షర్ డెవలప్‌మెంట్ చైర్మన్ డాక్టర్ ఎ ర్రోళ్ల శ్రీనివాస్, బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ గజ్జెల నాగేశ్, మల్కాజిగిరి పార్లమెంట్ టిఆర్ఎస్ ఇన్‌ఛార్జి మర్రి రాజశేఖర్‌రెడ్డి, కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డి, కంటోన్మెంట్ ఎమ్మెల్యే సాయన్న కూతురు నివేదిత, బోయిన్‌పల్లి మార్కెట్ మాజీ చైర్మన్ టీ.ఎన్.శ్రీనివాస్, టిఆర్ఎస్ యువనాయకుడు టి.రామేశ్వర్ గౌడ్, కంటో న్మెంట్ బోర్డు అధికారి పరశరామ్‌లు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన అతిథులను బస్తీ నాయకులు బత్తుల నారాయణ, ఎస్.రాము, రౌతు రాజయ్య, అంజయ్య ముదిరాజ్, జె.పరశరామ్, నర్సింగ్‌లు స్వాగతం పలికి శాలువకప్పి ఘనంగా సత్కరించారు.


పూజలు చేస్తున్న ఎర్రోళ్ల శ్రీనివాస్ తదితరులు

## నాట్యం, సంగీతం, కళలు మానసిక ఒత్తిడిని దూరం చేస్తాయి

**చిక్కడపల్లి, ఆగస్టు 1, ప్రభాతవార్త :** నాట్యం, సంగీతం, కళలు మానసిక ఒత్తిడిని దూరం చేస్తాయని, ప్రముఖ కవి, రసమయి సంస్థ అధినేత డాక్టర్ ఎం.కె.రాము అన్నారు. పిల్లలను చదువుతో కళాప్రక్రియలో ప్రోత్సహించాలని అన్నారు. చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలోని కళావేంకట దీక్షితులు కళావేదికలో వెంపటి కూచిపూడి డ్యాన్స్ అకాడమి ద్వితీయ వార్షికోత్సవం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ ఎం.కె.రాము మాట్లాడుతూ అకాడమి నిర్వాహకులు, ప్రఖ్యాత నాట్యగురువు వేంపటి చిన్న సత్యనారాయణ శిష్యుడు కావడం విశేషమన్నారు. త్యాగరాయ గానసభ అధ్యక్షుడు కళావిఎస్.జనార్దనమూర్తి, శ్రీలత తదితరులు పాల్గొన్న ఈకార్యక్రమంలో అకాడమి డైరెక్టర్ వెంపటి లక్ష్మణకుమార్ స్వాగతం పలికారు. అనంతరం శివ కళ్యాణం నృత్యరూపకం నయన మనోహరంగా ప్రదర్శించారు.



# హర్ ఘర్ తిరంగా క్యాంపెయిన్‌లో చేరిన ఎన్ఎండిసి

**హైదరాబాద్ ఆగస్టు 1, ప్రభాతవార్త :** ఈ నెల 13 నుండి 15 వరకు నిర్వహించనున్న ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా హర్ ఘర్ తిరంగా క్యాంపెయిన్‌లో భారత అతిపెద్ద ఐరన్ ఓర్ కంపెనీ ఎన్ఎండిసి చేరింది. ఈ సందర్భంగా మహవీర్ చక్ర అవార్డు గ్రహీత కల్నల్ బి. సంతోష్ బాబుకు పుష్పగుచ్చాలు వేసి ఘన నివాళ్లు అర్పించింది. హర్ ఘర్ తిరంగా క్యాంపెయిన్‌ను పురస్కరించుకుని ఎన్ఎండిసి సిఎండి సుమిత్ దేబ్ ఈ సందర్భంగా కల్నల్ బి. సంతోష్ బాబు కుటుంబ సభ్యులను ఘనంగా సన్మానించి త్రివర్ణ పతాకాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎండిసి సిఎండి సుమిత్ దేబ్ తో పాటు ఎన్ఎండిసి డైరెక్టర్ ( ఫైనాన్స్) అమితావా ముఖర్జీ, సివిఓ బి. విశ్వనాథ్ (ఐఆర్ఎస్ఎస్) తదితరులు పాల్గొన్నారు.

## మన ఊరు-మన ప్రణాళికలో అవతవకలు.?..నిధుల దుర్వినియోగంపై ప్రజావాణిలో ఫిర్యాదు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 1, ప్రభాతవార్త :** కీసర గ్రామపంచాయతీ పరిధిలో 2019-2020 సంవత్సరంలో హరితహారం, మన ఊరు-మన ప్రణాళిక కార్యక్రమంలో చేపట్టిన 30రోజుల పనులలో అవతవకలు, నిధులు దుర్వినియోగం విషయంపై సంబంధిత అధికారులు కూడ రిపోర్టు చేసినా నిధుల విచారణ విషయంపై ఇంత వరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవటంపై అంతర్యం ఏమిటని కీసర గ్రామ బిజెపి అధ్యక్షులు బండారి శ్రీనివాస్‌రెడ్డి కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. సోమవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులను, ఫిర్యాదులను జిల్లా అదనపు కలెక్టర్ జాన్ శ్యాంసన్ స్వీకరించటం జరిగింది. అయితే కీసర గ్రామపంచాయతీ పరిధిలో మన ఊరు-మన ప్రణాళికలో పనుల అవతవకలు, నిధుల దుర్వినియోగం విషయంపై చర్యలు తీసుకోవాలని ప్రజావాణి ద్వారా జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై కీసర ఎంపిడిఓకు 14సెప్టెంబరు2020న ఈ విషయంపై ఫిర్యాదు చేశామన్నారు. దీంతో ఈ ఫిర్యాదుపై ఎంపిఓ విచారణ జరిపి అవతవకలు, నిధులు ప్రజాధనం దుర్వినియోగం జరిగినట్లు రిపోర్టు కూడ చేశారని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎంపిఓ రిపోర్టు 2డిసెంబరు 2020న ఈ విషయంపై డిపిఓకు ఫిర్యాదు చేసినట్లు అయినా ఇప్పటి వరకు కూడ ఎలాంటి చర్యలు తీసుకోకపోవటం పట్ల అనుమానం వ్యక్తం అవుతుందని, ఇప్పటికైనా తగు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌కు చేసిన ఫిర్యాదులో కీసర గ్రామ బిజెపి అధ్యక్షులు బండారి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.

## ఎన్నో అడ్డంకులు ఎదుర్కొని ఉన్నతస్థాయికి ఎదిగిన వ్యక్తి ఆలీ
### - సిరికొండ మధుసూదనాచారి

**చిక్కడపల్లి, ఆగస్టు 1, ప్రభాతవార్త :** భారత ప్రధానమంత్రిగా పీవీ.నరసింహారావు ప్రతికూల పరిస్థితుల్లో కూడా జాతీయస్థాయిలో కీర్తి గడించారని తెలంగాణ శాసనసభ తొలి స్పీకర్, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి అన్నారు. సుప్రసిద్ధ సినీనటుడు డాక్టర్ ఆలీకి పీవీ. నరసింహారావు-కళానిలయం-వి3 న్యూస్ జీవన సాఫల్య-వెండికిరీట జాతీయ పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమం ఆదివారం రాత్రి చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో నిర్వాహక సంస్థ అధినేతలు కళానిలయం సురేందర్, పుష్పలత ఆధ్వర్యంలో పూర్వ ప్రధానమంత్రి స్వర్గీయ పీ.వి.నరసింహారావు జయంతి సభను పురస్కరించుకుని జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరై ఈ పురస్కారాన్ని ఆలికి అందించి గౌరవించారు. మధుసూదనాచారి మాట్లాడుతూ సినీనటుడు ఆలీ కూడా ఎన్నో అడ్డంకులు ఎదుర్కొని సినీరంగంలో ఉన్నతస్థాయికి ఎదిగి సేవ కార్యక్రమాలను విస్తృతంగా చేస్తున్నారని కొనియాడారు. సినీనటుడు ఆలీ మాట్లాడుతూ చిన్న దర్జీగా మానాన్న పనిచేసేవారని, ఆ కుటుంబం నుంచి ఈ స్థాయికి రావటానికి ప్రేక్షకులే కారణమని అన్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత పోలీసు ఉన్నతాధికారి సుంకర సత్యానారాయణ, త్యాగరాయ గానసభ అధ్యక్షుడు కళావిఎస్.జనార్దనమూర్తి, ప్రముఖ పారిశ్రామికవేత్త పి.వి.ప్రభాకరరావు, సరస్వతి ఉపాసకులు దైవజ్ఞశర్మ తదితరులు పాల్గొన్నారు.

## పోటీపరీక్షలకు సన్నద్ధమవుతున్న ఓ నిరుద్యోగ యువకుడు ఆత్మహత్య

**చిక్కడపల్లి, ఆగస్టు 1, ప్రభాతవార్త :** పోటీపరీక్షలకు సన్నద్దమవుతున్న ఓ నిరుద్యోగ యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన చిక్కడపల్లి పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. స్థానిక ఇన్‌స్పెక్టర్ ఎస్.సంజయ్‌కు మార్ తెలిపిన వివరాలు ఈవిధంగా ఉన్నాయి. కామారెడ్డి జిల్లా లింగంపల్లి మండలం, ఎక్కపల్లి తండాకు చెందిన మాలావత్ లచ్చిరామ్(25) హైదరాబాద్ నగరానికి వచ్చి చిక్కడపల్లి మెట్రోస్టేషన్ ఆవరణలోని శ్రీ రాజరాజేశ్వరి దేవాలయం వద్ద కిరాయికి ఉంటూ పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్నాడు. పరీక్షలకు సన్నద్దమవుతున్న తరుణంలో పరీక్షల వత్తిడి తట్టుకోలేకే ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఆత్మహత్య చేసుకున్న కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. కాగా పోలీసులు పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం మృతదేహాన్ని బంధువులకు అందించారు. పోలీసులు కేసును నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.


లచ్చిరామ్ (ఫైల్)

## హనుమకొండలో ఎన్ఎఫ్ఐడబ్ల్యూ రాష్ట్ర మహాసభలు

**సైఫాబాద్, ఆగస్టు 1, ప్రభాతవార్త :** భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) తెలంగాణ రాష్ట్ర 2 వ మహా సభలు ఈ నెల 28, 29, 30 తేదీలలో హనుమకొండలో జరుగుతా యని సమాఖ్య హైదరాబాద్ నగర సమితి తెలిపింది. ఈ మేరకు సోమవారం సమాఖ్య ముఖ్య నాయకురాళ్ళు ఈ మహాసభకు సంబంధించిన వాల్ పోస్టర్లను అవిష్కరించారు. ఈ సందర్భంగా సమాఖ్య అధ్యక్ష, కార్య దర్శులు నళిని పడాల, ఎస్. ఛాయాదేవి మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని టిఆర్ఎస్ 8 ఏళ్ళ పాలనలో మహిళల స్థితిగతులు పూర్తిగా క్షీణించాయని సమానత్వం లేకుండా పోయిందని ఆరోపించారు. ఉపాధి హామీ పథకం నిధులను కుదించి గ్రామీణ మహిళలకు జీవితాధారాన్ని లేకుండా చేసిందని, మరొకవైపు నిత్యావసర వస్తువుల ధరలు అకాశానంటుతున్నాయ ని, ఇందన, నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుదల వల్ల పేద కుంటుంబాల కు చెందిన మహిళలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.3 రోజులపాటు జరిగే మహా సభలలో చట్ట సభలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్‌లు కల్పించాలని, రాజ్యాంగ పరిరక్షణ, మహిళల హక్కులు, ధరలు పెరుగుదల, పని ప్రదేశాలలో మహిళలపై వేదింపులు, భద్రత, ఉచిత నిర్బంద విద్య, నిరుద్యోగం తదితర అంశాలపై చర్చించి పలు తీర్మానాలు అమోదించనున్నామని వారు వివరించారు. ఈ కార్యక్రమంలో అంజుం, శ్రీదేవి, లక్ష్మి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.


వాల్ పోస్టర్‌ను అవిష్కరిస్తున్న మహిళా నేతలు

# విఆర్ఓలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలి
## - తెలంగాణ తహసీల్దార్ అసోసియేషన్

**హైదరాబాద్ ఆగస్టు 1, ప్రభాతవార్త :** విఆర్ఓలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని, 121 జిఒను రద్దు చేయక పోతే ప్రజల్లోకి వెళ్తామని తెలంగాణ తహసీల్దార్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు లచ్చిరెడ్డి హెచ్చరించారు. సోమవారం నాడు సోమాజీగూడ ప్రెస్ క్లబ్‌లో తమ ఉద్యోగులతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. రెవెన్యూ వ్యవస్థ తెలంగాణకు ఆయువు పట్టు అని ప్రభుత్వం విఆర్ఓలను తొలగించి 22 నెలలు అయ్యిందని ఎందుకు తొలగించారో ఇప్పటి వరకు చెప్పడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. సిసిఎల్ఏ కమిషనర్ , రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీ రెవెన్యూ మంత్రి లేకుండా తమ శాఖను మొత్తం నిర్వీర్యం చేశారని లచ్చిరెడ్డి మండిపడ్డారు. రాష్ట్రంలో కొత్త జిల్లాలు, కొత్త మండలాలు పెంచారు కానీ, ఒక్క కొత్త పోస్టు కూడా పెంచలేదన్నారు. రెవెన్యూ శాఖలో ఒక్కపోస్టును క్రియేట్ చేయక పోగా ఏడు వేల విఆర్ఓ పోస్టులు రద్దు చేశారన్నారు. రెవెన్యూ డిపార్ట్ మెంట్‌పై ప్రభుత్వం ఎందుకు కక్ష గట్టిందో చెప్పాలన్నారు. ధరణి వచ్చిన తర్వాత కలెక్టర్ ఆర్‌డిఓ తహసీ ల్దార్‌లకు అధికారాలే లేవన్నారు. ధరణిని ఓ ప్రైవేట్ కంపెనీ నడుపుతోందని, దీనిపై కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేస్తామన్నారు. రెవెన్యూ వ్యవస్థలో ఉన్నఖాళీలను తక్షణమే భర్తీ చేయాలన్నారు. విఆర్ఓలను దొంగలుగా చిత్రీకరించి వేరే శాఖలోకి పంపి ఏం చేస్తారని ప్రశ్నించారు. తమను దొంగ లుగా చిత్రీకరించడం వల్ల మీకు వచ్చిన లాభం ఏంటని ప్రభుత్వాన్ని లచ్చిరె డ్డి ప్రశ్నించారు. మహా అయితే తమపై ఏసిబి దాడులు చేయిస్తారేమోగా ఉద్యోగాలను తొలగించలేరు కదా? అని లచ్చిరెడ్డి ప్రశ్నించారు.


సమావేశంలో మాట్లాడుతున్న లచ్చిరెడ్డి

# వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాల్లో చేర్చాల్సిందే
## - వాల్మీకి బోయ సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ


అభివాదం చేస్తున్న జేఏసీ నేతలు కృష్ణవాల్మీకి, మద్దులేటి, జగన్మోహన్‌నాయుడు

**హైదరాబాద్, ఆగస్టు 1, ప్రభాతవార్త :** వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాల్లో చేర్చేవరకు ఉద్యమాన్ని ఆపేది లేదని వాల్మీకి బోయ సంఘాల ఐక్య కార్యచరణ ప్రకటించింది. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జేఏసీ కోఆర్డినేటర్ రేపల్లె కృష్ణ వాల్మీకి మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 75ఏళ్లు పూర్తయినా వాల్మీకి బోయలు సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో చాలా వెనకబడి ఉన్నారన్నారు. 2017లో సిఎం కెసిఆర్ వనపర్తి బహిరంగ సభలో మాట్లాడుతూ వాల్మీకి బోయలను ట్రైబల్ జాబితాలో చేర్చుతామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. అలాగే వాల్మీకి బోయకులస్తుల స్థితిగతులను అధ్యయనం చేయడానికి 2017లో చెల్లప్ప కమిషన్‌ను ఏర్పాటు చేశారని ఆకమిషన్ సిఫార్స్‌లో భాగంగా వాల్మీకి బోయలు క్షేత్ర స్థాయిలో అనేక సమస్యలు ఎదర్కొంటున్నారని వారు ముమ్మాటికీ ఎస్టీ హోదాకు అర్హులేనని రిపోర్టులో పేర్కొన్నారన్నారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం ఎస్టీ జాబితాలో చేర్చు విషయంపై అసెంబ్లీలో ఓ ప్రజాప్రతినిధి అడిగిన ప్రశ్నకు బదులిస్తూ కేంద్ర ప్రభుత్వానికి తాము అసెంబ్లీలో తీర్మాణం చేసి పంపామని తెలిపారని అయితే కేంద్ర ప్రభుత్వంలోని అధికారులతో మాట్లాడగా తమకు తెలంగాణ రాష్ట్ర నుంచి ఎటువంటి సిఫార్స్‌లు అందలేదని తెలిపిందన్నారు. దీంతో హోదా విషయంలో రాష్ట్ర ప్రభుత్వంద్వంద వైఖరి అవలంభిస్తుందన్న విషయం బట్టబయలైందన్నారు. కావున రాష్ట్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా రాష్ట్ర వ్యాప్తంగా వాల్మీకి బోయ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో అన్ని మండల కార్యాలయాల ముందు ఈనెల 4వ తేదీన ధర్నా నిర్వహించి మెమోరండం సమర్పించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మా జీ జడ్పీటిసి సభ్యులు మద్దిలేటి, జగన్‌మోహన్‌నాయుడు, శ్రీనివాసులు, శివన్న, రాములు, వెంకటనారాయణ, వడ్డెపల్లి కృష్ణ, కోటేష్ పాల్గొన్నారు.

# ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం

**చిక్కడపల్లి, ఆగస్టు 1, ప్రభాతవార్త :** దేశంలో పర్యావరణ చట్టాలు ఎన్ని ఉన్నా కూడా వాటి అమలు మాత్రం నేటికి ప్రశ్నార్థకంగా మారిందని ప్రముఖ పర్యావరణవేత్త, విద్యావేత్త ప్రొఫెసర్ డాక్టర్ కె.పురుషోత్తమ్‌రెడ్డి అన్నారు. చిక్కడపల్లి పెండేకంటి న్యాయ కళాశాలలో ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు జరిగింది. ముఖ్యవక్తగా పాల్గొన్న ప్రొఫెసర్ పురుషోత్తమ్‌రెడ్డి మాట్లాడుతూ మానవ వనరులను రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. సహజ వనరులను ముందు తరాల కోసం కాపాడాలని, వాటి తరుగుదల మానవాళి మనుగడకు ముప్పు అని అన్నారు. డాక్టర్ లుబ్నా సర్వత్ మాట్లాడుతూ భారతరాజ్యాంగంలోని అధికరణల ప్రకారం పర్యావరణ పరిరక్షణ కోసం ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, వీటి పరిరక్షణ పౌరులదేనని అన్నారు. న్యాయ విద్యార్థులు పర్యావరణ సమస్యలపై గళం ఎత్తాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన వాసవీ అకాడమి ఆఫ్ ఎడ్యుకేషన్ కోశాధికారి వివిఎం.పార్థసారథి మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించి పర్యావరణాన్ని పరిరక్షించాలని అన్నారు. కార్యక్రమంలో కాలేజ్ మేనేజింగ్ కమిటీ సభ్యుడు ఎం.ఆనంద్‌కుమార్, ఇంచార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.అరవింద, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎ.వాణి, న్యాయకళాశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న ప్రముఖ పర్యావరణవేత్త ప్రొఫెసర్ డాక్టర్ కె.పురుషోత్తమ్‌రెడ్డి

## గుంతలమయమైన రోడ్లతో ప్రయాణం నరకప్రాయం



కుంట్లూర్-రాజీవ్‌గృహకల్ప మార్గంలో గుంతలమయంగా రోడ్డు

**హయత్‌నగర్, ఆగస్టు 1 ప్రభాతవార్త :** చిన్నపాటి వర్షానికే గుంతలు, చిత్తడిగా మారుతున్న రోడ్లతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లను విస్తరించే సమయంలో కొన్ని చోట్ల అసంపూర్తిగా వదిలివేయడం, ఉన్న బీటీరోడ్ల నిర్వహణ సరిగా లేక మరికొన్ని చోట్ల రోడ్లు రాకపోకలకు వీలులేకుండా పోతున్నాయి. కోట్లరూపాయలు వెచ్చించి అభివృద్ధి పనులను పూర్తి చేస్తున్నామని ప్రజాప్రతినిధులు, అధికారులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితి దానికి బిన్నంగా ఉంది. పెద్ద అంబర్‌పేట మున్సిపాలిటీ పరిధిలో కుంట్లూర్ నుంచి రాజీవ్ గృహకల్పకు వెళ్లేరోడ్డుతో పాటు పెద్దఅంబర్‌పేట నుంచి పసుమాముల వెళ్లే రోడ్లు భారీ గుంతలతో రాకపోకలకు కష్టంగా మారుతున్నాయి. కుంట్లూర్-రాజీవ్ గృహకల్ప రోడ్డు విస్తరణ అసంపూర్తిగా మిగిలింది. జయప్రకాష్ కాలనీలో దాదాపు 200 మీటర్ల మేర రోడ్డును వదిలివేశారు. ఇటీవలి వర్షాలకు సదరు రోడ్డులో భారీ గుంతలు ఏర్పడ్డాయి. ఇక పసుమాములకు వెళ్లేదారిలో రోడ్డుకోతలకు గురికావడం, ఆ గుంతల్లో వరదనీరు చేరడంతో వాహనదారులకు ప్రయాణం నరకప్రాయంగా మారింది. గుంతల కారణంగా ద్విచక్ర వాహనదారులకు మెడలు, వెన్నుముక సమస్యలు తలెత్తుతున్నాయి. కార్లు కింది భాగంలో ధ్వంసమవుతున్నాయి. ఎప్పటికపుడు గుంతలను తాత్కాలికంగా పూడ్చడం కానీ, విస్తరణ పనులను పూర్తిచేయడం ద్వారాకానీ సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

## చెత్త తొలగించని మున్సిపల్ అధికారులు - ఆగ్రహంలో కాలనీవాసులు



చెత్త బ్యాగులవద్ద నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం

**ఎల్.బి.నగర్, ఆగస్టు 1 ప్రభాతవార్త:** దేవాలయం వద్ద భారీ ఎత్తున చెత్త పేరుకుపోయినప్పటికి అధికారులు, సిబ్బంది పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నాగోల్ డివిజన్ జైపురి కాలనీలోని శ్రీపోచమ్మ తల్లి గుడి వద్ద బోనాల జాతర సందర్భంగా పేరుకుపోయిన వ్యర్థాలను తీసుకెళ్లకుండా నిర్లక్ష్యం వహిస్తున్న జీహెచ్‌ఎంసీ అధికారుల తీరు పట్ల స్థానిక కాలనీవాసులో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిహెచ్‌ఎంసి అధికారులు సిబ్బంది చెత్త తొలగించే విషయంలో చర్యలు చేపట్టక పోవడంతో సోమవారం ఉదయం గుడివద్ద కమిటీ సబ్యులందరూ కలిసి మొత్తం చెత్తను సంచుల్లో నింపారు. అనంతరం అధికారులకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. తాము సహకరిస్తున్నప్పటికీ అధికారులు, సిబ్బంది మాత్రం నిర్లక్ష్య ధోరణితో కాలనీవాసులు మండిపడుతున్నారు. సోమవారం ఫలహారం బండి ఊరేగింపు కార్యక్రమం ఉందని అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన కూడా ఇటువైపు వచ్చి తొంగిచూడడం లేదన్నారు. చెత్తాచెదారం పేరుకుపోవడం వల్ల దేవాలయం వద్ద ఇబ్బందికర పరిస్థితి నెలకొందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నువ్వులబండ గుడిలో సైతం వ్యర్థాలు అలాగే వదిలేశారని, ఫోన్ చేస్తే మా వద్ద వాహనం అందుబాటులో లేదని సమాధానం చెబుతూ కాలక్షేపం చేస్తున్నారని కాలనీవాసులు మండిపడుతున్నారు. గట్టిగా నిలదీయడంతో మీ ఇష్టమొచ్చినవారికి చెప్పుకోండి అంటూ సమాధానం ఇస్తున్నారని కాలనీవాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే చెత్త తొలగించే విధంగా చర్యలు చేపట్టాలని కోరుతున్నాను.

## ముంపు ప్రాంతాల్లో కార్పోరేటర్ శాంతి సాయిజన్ శేఖర్ పర్యటన



ముంపు సమస్యను తెలుసుకుంటున్న కార్పోరేటర్ శాంతిశేఖర్

**తార్నాక, ఆగస్టు 1 ప్రభాతవార్త:** వరుసగా కురుస్తున్న వానకు పటేల్‌కుంట చెరువులోకి ఎగువనున్న చెరువులు నిండి నీరు రావడంతో పటేల్‌కుంట చెరువు నిండుకుండలా మారడంతో నాచారం డివిజన్‌లో లోతట్టు ప్రాంతాలన్ని జలమయమయ్యాయి. ముంపు సమస్యలను తెలుసుకునేందుకు ముంపు ప్రాంతాల్లో కార్పోరేటర్ సాయిజెన్ శాంతిశేఖర్ జీహెచ్‌ఎంసీ సిబ్బందితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పటేల్‌కుంట చెరువువద్ద నిర్మించిన బాక్స్ కల్వర్టుగుండా నాలాలోకి నీరు సక్రమంగా వెళుతుందని బాక్స్ కల్వర్టు ఏర్పాటు చేయకుంటే శ్రీరాంనగర్, ఎర్రకుంటలోకి భారీగా నీరు వచ్చేదన్నారు. వీరారెడ్డి నగర్‌లో మాన్‌సూన్ టీంతో డ్రైనేజీ సమస్యను పరిష్కరించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సాయిజన్ శేఖర్, అంజి, సత్యనారాయణ, శ్రీరాం, కర్ణ, దాసరి రవి, మహేష్, ఫరీఫ్, చంద్రశేఖర్, ఇంజనీర్ హరిలాల్, డిప్యూటీ ఇంజనీర్ లింగారావు, వర్క్ ఇన్స్‌పెక్టర్ విజయ్‌కుమార్, డిఈ పవన్ పాల్గొన్నారు.

## శ్రీ అభయాంజనేయస్వామి ఆలయ చైర్మన్‌గా లక్ష్మినారాయణ



ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే బేతి తదితరులు

**ఉప్పల్, ఆగస్టు 1 ప్రభాతవార్త :** ఉప్పల్ ఎన్‌జిఆర్‌ఐ శ్రీ అభయాంజనేయస్వామి దేవస్థానం చైర్మన్‌గా వై.లక్ష్మినారాయణ నియమితులైయ్యారు. ఏడాది కాలంపాటు ఆయన పదవిలో కొనసాగుతారు. ఈ మేరకు సోమవారం ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, కార్పొరేటర్ బన్నాల గీత, దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ ప్రణీత్, ఆలయ కార్యనిర్వహణాధికారి ఎల్.భాగ్యలక్ష్మి, శ్రీకాంత్ తదితరుల సమక్షంలో వై.లక్ష్మినారాయణచే ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామన్నారు. ఆలయం నిర్మాణం విజయవంతంగా సాగుతుందన్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు ఎం.అంజయ్య, కట్టా నాగయ్య, కె.నరసింహ, ఎ.వెంకట్‌రెడ్డి, సభ్యులు వేణుగోపాల్‌రెడ్డి, అశోక్, నయాబు వెంకట్రావ్, సత్యపాల్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, వెంకట్‌రెడ్డి, ఉమాపతిరెడ్డి, రాజేశ్వరి, పూజారి రవీంద్రశర్మ, జూనియర్ అసిస్టెంట్ శ్రీకాంత్, క్లర్క్ పవన్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : ప్రభుదాస్



ముంపు ప్రాంతాలను సందర్శించిన కార్పొరేటర్ ప్రబుదాస్

**కుషాయిగూడ ఆగస్టు 1 ప్రభాతవార్త :** లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మీర్పేట్ డివిజన్ కార్పొరేటర్ జేరిపోతుల ప్రబుదాస్ పేర్కొన్నారు. కాప్రాస సర్కిల్ పరిధిలోని మీర్పేట్ డివిజన్లో భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న లోతట్టు ప్రాంతాలను ఆయన మాజీ కార్పొరేటర్ గుందారపు శ్రీనివాస్ రెడ్డి అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాన్‌సూన్ బృందం ఎల్లవేళలా అందుబాటులోఉంటుందని ప్రజలకు హామీ ఇచ్చారు. ఎలాంటి ఇబ్బందులున్నా వెంటనే తమకు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్స్‌పెక్టర్ చారి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు గిట్టుబాటు ధర అందిస్తాం : చైర్మన్ అనితానాయక్



రైతులతో మాట్లాడుతున్న చైర్మన్ అనిత తదితరులు

**మలక్‌పేట, ఆగస్టు 1 ప్రభాతవార్త :** రైతులకు గిట్టుబాటు ధర అందిస్తా_మని హైదరాబాద్ నగర వ్యవసాయ కమిటీ చైర్మన్ అనితానాయక్ పేర్కొన్నారు. మలక్‌పేట మహబూబ్‌మాన్షన్ మార్కెట్‌లో డైరెక్టర్లతో కలిసి ఆమె పర్యటించి రైతులతో సంభాషించారు. రైతులకు అందుతున్న గిట్టుబాటుధర, మార్కెట్‌లోని సౌకర్యాలగురించి పలువురు రైతులను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా మార్కెట్ యార్డులను సందర్శించి లీకేజీసమస్యల గురించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మార్కెట్‌కు వచ్చే రైతులకు అన్ని సౌకర్యాలు కల్పించే విధంగా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు మైల రవికాంత్, బట్కిరి విద్యానంద్, లలిత, అభిషేకం, సల్మాన్, ఎజాస్, మాణిక్‌రాజ్, రాము యాదవ్, యాదగిరి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఆజాదీకా అమృత్ మహోత్సవ్



విజేతలకు బహుమతులు అందజేస్తున్న కళాభారతి సభ్యులు

**వనస్థలిపురం, ఆగస్టు 1 ప్రభాతవార్త :** హయత్‌నగర్ డివిజన్ శారదానగర్ శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి ఆలయప్రాంగణంలో ఆజాదీకా అమృత్ మహోత్సవ్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కళాభారతి సాహితీ, సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గాయనీగాయకులు ఫణిచంద్ర, కె.మాధురి, సుభాష్, చిన్మయి, చాతుర్య, యశస్విని, మోక్షిత తదితరులు చక్కటి పాటలు పాడి శ్రోతలను అలరించారు. ఈ సందర్భంగా సంగీత, సాహిత్య, వక్తృత్వ, క్విజ్ పోటీలలో పాల్గొన్న గాయకులకు బహుమతులు అందజజేశారు. సీనియర్ సిటిజన్ ఫోరం గౌరవ సలహాదారు ఎ.ఎల్.నర్సింహ్మారావును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాభారతి కన్వీనర్ కొప్పోలు జగన్నాథరావు, కార్యదర్శి అరుణ్‌కుమార్, ఆలయ కమిటీ అధ్యక్షుడు యాదగిరిరావు, సత్యారెడ్డి, కె.ఎల్.నర్సింహ్మారావు, శ్రీశైలం, ఇందిర, జ్ఞానేశ్వర్, సూర్యనారాయణరావు, వీరన్న, అప్పారావు, ప్రదీప్‌రావు, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## కమిట్మెంట్ చిత్ర యూనిట్‌పై పోలీసులకు ఫిర్యాదు : విహెచ్‌పి



సిఐ కి ఫిర్యాదు పత్రాన్ని అందజేస్తున్న విహెచ్‌పి నాయకులు

**వనస్థలిపురం, ఆగస్టు 1 ప్రభాతవార్త :** కమిట్మెంట్ చిత్ర యూనిట్‌పై విశ్వ హిందూ పరిషత్ రాష్ట్ర సహాయ కార్యదర్శి రావినూతన శశిధర్ వనస్థలిపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బెడ్ రూంలో శృంగారంతో కూడిన అశ్లీల దృశ్యాలకు భగవద్గీత శ్లోకాలను జోడించి చిత్రీకరించిన కమిట్మెంట్ చిత్ర యూనిట్, చిత్ర ట్రైలర్‌కు అనుమతించిన సెన్సార్ బోర్డు అధికారులపై క్రిమినల్ కేసులునమోదు చేసి చట్టపర చర్యలు చేపట్టాలని కోరుతూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందువులు పవిత్రంగా పూజించే భగవద్గీత శ్లోకాలను అశ్లీదృశ్యాలకు జోడించి హిందువుల విశ్వాసాన్ని గాయపర్చారని సంబంధిత వ్యక్తులపై వెంటనే కేసు నమోదుచేసి అరెస్టు చేయాలని లేనిచో విహెచ్‌పి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ముద్దగౌని శేఖర్‌గౌడ్, తడకమళ్ల రవికుమార్, సతీష్, శ్రీధర్‌రెడ్డి, రవిశంకర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## కలుషిత నీటితో చిన్న చెరువులో చేపలు మృత్యువాత



కలుషిత నీటి కారణంగా రామంతాపూర్ చిన్న చెరువులో చేపలు మృత్యువాతపడిన దృశ్యం.

**రామంతాపూర్, ఆగస్టు 1 ప్రభాతవార్త :** రామంతాపూర్ చిన్న చెరువులో కలుషిత నీటి కారణంగా వేల సంఖ్యలో చేపలు మృత్యువాత పడ్డాయి. 2రోజులుగా కురుస్తున్న వర్షాలకు చెరువులోకి వర్షం నీరు వచ్చి చేరుతోంది. రామంతాపూర్ చిన్న చెరువు సమీపంలోనే పారిశ్రామికవాడ ప్రాంతాలు ఉండడం, కలుషితజలాలు నేరుగా చెరువులో కలుస్తుండడంతో చేపలు మృత్యువాత పడ్డాయని మత్సకార సంఘం నేత నాసు సతీష్ తెలిపారు. చేపలు మృత్యువాత పడిన విషయం తెలిసిన వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. చెరువు సమీపంలోనే కలుషిత నీటిపై పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆయన ఆరోపించారు. చెరువులో చేపలు చనిపోవడంతో మత్సకారులకు తీవ్ర నష్టం జరిగిందని తెలిపారు. ప్రభుత్వం చెరువులో చెత్తాచెదారం తొలగించడంలేదని, కలుషిత జలాలు అరికట్టేందుకు ఎటువంటి చర్యలు తీసుకోవడంలేదని ఆరోపించారు. అధికారులు స్పందించి దీనిపై తగు చర్యలు తీసుకోవాలని సూచించారు.

## గుర్రంగూడ పోచమ్మకు మంత్రి పూజలు



సబితారెడ్డిని సన్మానిస్తున్న గుర్రంగూడ ఆలయ కమిటీ చైర్మన్

**సరూర్‌నగర్, ఆగస్టు 1 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ కార్పొరేషన్ గుర్రంగూడలో 2 రోజుల పాటు జరిగే బోనాల ఉత్సవాలను పురస్కరించుకొని సోమవారం రాత్రి పోచమ్మ అమ్మవారిని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి దర్శించుకొని పూజలు చేశారు. అదేవిధంగా రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ సాయిచంద్ కూడా అమ్మవారికి పూజలు జరిపారు. కాగా పండుగ సందర్భంగా ఆలయ చైర్మన్ జక్కిడి శ్రీనివాస్‌రెడ్డి అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో జక్కిడి సుధాకర్‌రెడ్డి, జక్కిడి ముత్యంరెడ్డి, సామ సత్యనారాయణరెడ్డి, ఇఎల్‌వి అశోక్, సింగిరెడ్డి ఆనంద్‌రెడ్డి, జక్కిడి నరేందర్‌రెడ్డి, జక్కిడి రాజిరెడ్డి, పలస రాఘవేందర్‌గౌడ్, జక్కిడి గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ దేవతలకు అందెల పూజలు

**సరూర్‌నగర్, ఆగస్టు 1 ప్రభాతవార్త:** గుర్రంగూడ బోనాల సందర్భంగా రాష్ట్ర బిజెపి కార్యవర్గ సభ్యుడు, మహేశ్వరం నియోజకవర్గ బిజెపి ఇంఛార్జి అందెల శ్రీరాములు యాదవ్ గ్రామ దేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామ మాజీ పర్సన్ ఇంఛార్జి, బడంగ్‌పేట్ కార్పొరేషన్ 26వ డివిజన్ బిజెపి ఇంఛార్జి జక్కిడి జంగారెడ్డి అందెలను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ దడిగ శంకర్, జక్కిడి మధుసూదన్‌రెడ్డిలతో పాటు కార్పొరేషన్‌కు చెందిన పలువురు నాయకులు పాల్గొన్నారు.

## ఎన్నికల నియమావళిపై సమావేశం

**ఎల్.బి.నగర్, ఆగస్టు 1 ప్రభాతవార్త :** ఎన్నికల నియమ నిబంధనలకు సంబంధించి హయత్‌నగర్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం సమావేశం నిర్వహించారు. ఎల్బీనగర్ ఎన్నికల అధికారి, ఉపకమిషనర్ మారుతిదివాకర్ ఆధ్వర్యంలో ఉప కమిషనర్‌లు హరికృష్ణయ్య, సురేందర్‌రెడ్డి, పలు పార్టీల ప్రతినిధులతో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎన్నికల నియమ నిబంధనలకు సంబంధించి ఆధార్ కార్డును లింకు, కొత్త ఓటర్ నమోదు, తప్పులుంటే వాటిని మార్పులు చేసుకోవడం, 17 సంవత్సరాల వయసు ఉన్నవాళ్లు ఓటరుగా నమోదు చేసుకోవడం, ఒకటి కంటే ఎక్కువ ఓట్లు ఉన్నవారిని, చనిపోయిన వారి ఓట్లను తొలగించడం తదితర అంశాలకు సంబంధించి సమావేశంలో చర్చ జరిపారు.

## జల్‌పల్లి బోనాల్లో యెల్మేటి పూజలు

**సరూర్‌నగర్, ఆగస్టు 1 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గంలోని జల్‌పల్లిలో జరిగిన బోనాల సందర్భంగా టిపిసిసి కార్యదర్శి యెల్మేటి అమరేందర్‌రెడ్డి గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన రంగారెడ్డి డిసిసి అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి, బడంగ్‌పేట్ కార్పొరేషన్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి తదితరులతో కలిసి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ అధ్యక్షుడు సమద్ బిన్ సిద్దిఖీ, నాయకులు అబ్దుల్ బారి, రవి, శ్రీనివాస్, దయానంద్, పాండు పాల్గొన్నారు.

## సిఎం సహాయనిధి పేదలకు వరం

**ఉప్పల్, ఆగస్టు 1 ప్రభాతవార్త :** సిఎం సహాయనిధి పథకం నిరుపేదలకు ఒక వరంలాంటిదని ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం హబ్సిగూడకు చెందిన బలరామ్ బిస్వాల్ అనారోగ్యంతో బాధపడుతుండడంతో సిఎం సహాయనిధి పథకం కింద మంజూరు అయిన రూ.లక్ష ఎల్‌ఓసి పత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజల కోసం పాటుపడిన వారికి తగు గుర్తింపు ఉంటుందన్నారు.

## కరోనా వ్యాక్సినేషన్ సెంటర్ ప్రారంభం



వ్యాక్సినేషన్ సెంటర్‌ను ప్రారంభించిన కౌన్సిలర్ శ్రీలత

**తుర్కయంజాల్, ఆగస్టు 1 ప్రభాతవార్త :** తుర్కయంజాల్ మున్సిపాలిటీ ఉమర్‌ఖాన్‌గూడ వార్డుకార్యాలయంలో కౌన్సిలర్, ఫ్లోర్ లీడర్ కరాడి శ్రీలత అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో కరోనా వ్యాక్సినేషన్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రధాని మోడీ దేశ ప్రజల సంక్షేమంకోసం ఉచితంగా వ్యాక్సిన్ పంపిణీ చేయడం జరుగుతుందని ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా వేయించుకోవాలని కోరారు. 12 సంవత్సరాల పైబడిన వారందరు వ్యాక్సిన్ వేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నరసింహారెడ్డి, నల్ల బాల్‌రెడ్డి, నల్ల ధర్మారెడ్డి, సతీష్ రెడ్డి, నల్ల మల్లారెడ్డి, బండారు శ్రీశైలం, రంగనాథ్, వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## 4న ఉప్పల్‌లో బోనాల ఉత్సవాలు



ఉప్పల్‌లోని శ్రీ మహంకాళి దేవాలయం దృశ్యం

**ఉప్పల్, ఆగస్టు 1 ప్రభాతవార్త :** ఉప్పల్‌లో అంగరంగ వైభవంగా జరిగే మహంకాళి బోనాల ఉత్సవాలు ఈనెల 4వ తేదిన గురువారం వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు ఘనంగా చేశారు. అధికారుల నిబంధనలు పాటిస్తూ ఉత్సవాలు శాంతియుతంగా నిర్వహించాలని కమిటి నేతలు నిర్ణయించారు. ఆలయ కమిటి నిర్వహకులు మహంకాళి లక్ష్మణ్, మహంకాళి నరసింహ, రాజుల ఆధ్వర్యంలో ఆలయం వద్ద వివిధ ఏర్పాట్లు చేశారు. బోనాల ఉత్సవాల సందర్భంగా ఆలయాన్ని రంగురంగు విద్యుత్ దీపాలతో అలంకరించారు. పలువురు పార్టీ నేతలు ఫలహార బండి ఊరేగింపు కోసం రంగం సిద్దం చేసుకుంటున్నారు. ఉప్పల్ మహంకాళి దేవాలయం వద్ద ప్రత్యేకంగా స్వాగత వేదిక నిర్మాణం చేస్తున్నారు.

**ఈదమ్మ దేవాలయంలో...** సర్వే ఆఫ్ ఇండియా వద్ద ఉన్న ఈదమ్మ దేవాలయాలలో ఉత్సవాలు బోనాల ఉత్సవాలకు ఏర్పాట్లు చేశారు. ఆలయ కమిటి నేతలు గుమిడెల్లి నర్సింగ్ రావు, నరసింహ, మల్లేష్, యాదయ్య, జంగయ్య, మల్లేష్, లక్ష్మయ్య తదితరుల ఆధ్వర్యంలో ఉత్సవాల కోసం ఏర్పాట్లు చేశారు. ఉత్సవాల సందర్భంగా భారీ ఏర్పాట్లు చేశారు.

## రాజకీయాలకతీతంగా అభివృద్ధి : మేయర్, డిప్యూటీ మేయర్



శంకుస్థాపన చేస్తున్న మేయర్ దుర్గ, డిప్యూటీ మేయర్ విక్రంరెడ్డి, కార్పొరేటర్ పద్మ తదితరులు

**సరూర్‌నగర్, ఆగస్టు 1 ప్రభాతవార్త:** రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి సహకారంతో మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని అన్ని డివిజన్లలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని మేయర్ ముదావత్ దుర్గదీప్‌లాల్‌చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డిలు స్పష్టం చేశారు. కార్పొరేషన్‌లోని 17వ డివిజన్ కార్పొరేటర్ పోరెడ్డి పద్మా భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో జిల్లెలగూడలోని జైహనుమాన్‌నగర్‌కాలనీలో రూ.15 లక్షలతో చేపట్టిన భూగర్భ డ్రైనేజీ, సిసి రోడ్డు పనులు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా హాజరైన వారు కమీషనర్ చిట్టి నాగేశ్వర్‌రావు, డిఇఇ గోపినాథ్ తదితరులతో కలిసి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం నాయకులు శ్రీనివాస్, సుధాకర్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, మాధవరెడ్డి, సత్యనారాయణ, కోటేశ్వర్‌రావు, కిష్టయ్య, కమలాకర్, ఇస్మాయిల్, కాలనీవాసులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి : రాధా



మొక్కలు నాటుతున్న కార్పొరేటర్ రాధాధీరజ్‌రెడ్డి

**ఎల్.బి.నగర్, ఆగస్టు 1 ప్రభాతవార్త:** పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆర్‌కెపురం డివిజన్ కార్పొరేటర్ రాధాధీరజ్‌రెడ్డి కోరారు. డివిజన్‌లోని గ్రీన్‌హిల్స్ కాలనీలో సోమవారం హరితహారం కార్యక్రమంలో భాగంగా కార్పొరేటర్ కాలనీ వాసులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పర్యావరణాన్ని మనం కాపాడితే పర్యావరణం మనల్ని కాపాడుతుందనే విషయాన్ని అందరూ గుర్తుంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు, బీజేపీ నాయకులు శ్రీనివాస్, రమేష్‌గౌడ్ , డివిజన్ ప్రధాన కార్యదర్శి సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

## బూస్టర్ డోస్ కోవిడ్ వ్యాక్సిన్ తప్పనిసరి: మేయర్ పారిజాత



బాలాపూర్‌లో వ్యాక్సినేషన్‌ను పరిశీలిస్తున్న మేయర్ పారిజాత

**సరూర్‌నగర్, ఆగస్టు 1 ప్రభాతవార్త:** కోవిడ్ మొదటి, రెండవ డోసు వ్యాక్సిన్లు తీసుకున్న వారు తప్పనిసరిగా బూస్టర్ డోస్ వేసుకోవాలని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి సూచించారు. బాలాపూర్ వార్డుకార్యాలయంలో ఏర్పాటైన కోవిడ్ వ్యాక్సినేషన్ కేంద్రాన్ని సోమవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా వ్యాక్సినేషన్ తీరును పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కోవిడ్ నివారణకు కార్పొరేషన్‌లో ప్రత్యేకంగా కేంద్రాలను ఏర్పాటు చేసి వ్యాక్సిన్లను ఇవ్వడం జరుగుతున్నదనీ ఈ నేపథ్యంలో బూస్టర్ డోసులతో, మొదటి, రెండవ డోసును ఇవ్వడం జరుగుతున్నదని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, కార్పొరేటర్లు వంగేటి ప్రభాకర్, బండారి మనోహర్, బాలు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూమిని రక్షించాలని ధర్నా

**అబ్దుల్లాపూర్‌మెట్, ఆగస్టు 1 ప్రభాతవార్త:** తట్టిఅన్నారం గ్రామంలోని ప్రభుత్వ భూమిని రక్షించాలని ఏడాదిగా చేస్తున్న పోరాటాల ఫలితంగా సర్వే చేసి హద్దురాళ్ళు పాతారు. కబ్జాదారులు సర్వే రాళ్లను ఊడదీసి స్థానిక ప్రజాప్రతినిధుల అండతో రెవెన్యూ అధికారులను బెదిరిస్తూ, మున్సిపాలిటీ నుండి ఎటువంటి పర్మిషన్లు లేకుండా అక్రమ నిర్మాణాలకు పాల్పడుతున్నారు. అక్రమ నిర్మాణాలను కూల్చివేసి ప్రభుత్వ భూమి రక్షించి అర్హులైన పేదలకు ఇవ్వాలని అబ్దుల్లాపూర్మెట్ మండల సిపిఎం కార్యదర్శి ఏర్పుల నరసింహ డిమాండ్ చేశారు, అక్రమ నిర్మాణాలకు పాల్పడుతున్న కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని లేనియెడల ఉధృతమైన పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డివిప్సి రంగారెడ్డి జిల్లా కార్యదర్శి నల్ల ప్రభాకర్, చుక్క రవి, మునీందర్ రెడ్డి, సర్వయ్య, సుధాకర్, మల్లయ్య, సౌజన్య, మంజుల, లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

## పహాడీషరీఫ్ పోచమ్మ ఆలయంలో ఎంపి రంజిత్‌రెడ్డి ప్రత్యేక పూజలు



పోచమ్మ ఆలయంలో పూజలు చేసిన ఎంపి రంజిత్‌రెడ్డి

**సరూర్‌నగర్, ఆగస్టు 1 ప్రభాతవార్త:** శ్రావణ మాస బోనాల ఉత్సవాలను పురస్కరించుకొని చేవెళ్ల ఎంపి డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి మహేశ్వరం నియోజకవర్గం జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని పురాతన పహాడీషరీఫ్ పోచమ్మ ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ, స్థానిక టిఆర్‌ఎస్ నాయకులు, యువజన విభాగం నేతలు ఎంపికి ఘనస్వాగతం పలికారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆ తర్వాత రంజిత్‌రెడ్డిని శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ పందెం పుష్పమ్మయాదవ్, కొండల్‌యాదవ్, మాజీసర్పంచ్‌లు అబ్దుల్లాబిన్ అవధ్, మిరాజ్‌ఖాన్, స్థానిక నాయకులు బాలరాజ్‌యాదవ్, రమేష్‌గౌడ్, సురేష్‌గౌడ్, రాజేష్, విశాల్‌గౌడ్, శంకర్‌యాదవ్, మల్లేష్‌ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బోనాల ఉత్సవాలు



బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ యేగ్గే మల్లేశం

**ఎల్.బి.నగర్, ఆగస్టు 1 ప్రభాతవార్త:** బోనాల ఉత్సవాలు నాగోలు గ్రామంలో వైభవంగా నిర్వహించామని ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశంకురుమ తెలిపారు. నాగోల్ గ్రామంలో శ్రీ మహంకాళి పోచమ్మ దేవస్థానం, నవ చైతన్య యువజన సంఘం ఆధ్వర్యంలో బోనాల జాతర ఘనంగా నిర్వహించారు. శ్రీమహంకాళి, పోచమ్మ దేవాలయంలో ఆదివారం వందలాది మంది భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కలు తీర్చుకున్నారు. జాతరలో పోతరాజుల విన్యాసాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు ఎగ్గే మల్లేశం, బొగ్గవరపు దయానంద్, పర్యాటకశాఖ అభివృద్ధి చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, నాగోల్ కార్పొరేటర్ చింతల అరుణ, మాజీ కార్పొరేటర్ చెరుకు సంగీతప్రశాంత్‌గౌడ్, అనంతుల రాజారెడ్డి, బద్దం మహేందర్‌గౌడ్, చింతల సురేంద్రనాథ్‌యాదవ్, నవచైతన్య యువజన సంఘం ప్రెసిడెంట్ చెరుకు ప్రవీణ్‌కుమార్‌గౌడ్, స్వాతిన్‌గౌడ్, మధుగౌడ్, కొలన్ నర్సింహగౌడ్, నాగోలు సుధాకరచారి, పల్లె సీతారాములుగౌడ్ పాల్గొన్నారు.

## పండుగల ఏర్పాట్లకై అధికారులతో చర్చించిన కార్పొరేటర్ శ్రావణ్



మున్సిపల్ అధికారులతో చర్చిస్తున్న కార్పొరేటర్ శ్రావణ్

**నేరేడ్‌మెట్, ఆగస్టు 1 ప్రభాతవార్త:** వినాయక చవితి, బతుకమ్మ, దసరాపండుగల నేపథ్యంలో సఫిల్‌గూడ మినీ ట్యాంక్ బండ్‌పై జరిగే ఏర్పాట్లపై మున్సిపల్, సంబంధిత అధికారులతో కార్పొరేటర్ శ్రావణ్ చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక నిమజ్జనం చేసే బేబీ పాండ్ ఔట్‌లెట్లకు సంబంధించి మరమ్మతులు, టాయిలెట్స్, గుర్రపుడెక్క, మురికినీరు, పార్కులో చేయాల్సిన అదనపు పనుల విషయంపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ఇతర సంబంధిత అధికారులతో సమావేశం ఏర్పాటుచేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డిసి రాజు, ఈఈ లక్ష్మణ్, ఏఈ సత్యలక్ష్మి, శివానంద్, మహేందర్, లక్ష్మణ్, దుర్గా ప్రసాద్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## విఆర్‌ఎల సమస్యలు తీర్చాలి : బిఎస్‌పి గుడ్ల శ్రీనివాస్

**సరూర్‌నగర్, ఆగస్టు 1 ప్రభాతవార్త:** విఆర్‌ఎల న్యాయమైన డిమాండ్లను తీర్చాలని మహేశ్వరం నియోజకవర్గ బిఎస్‌పి పార్టీ అధ్యక్షుడు గుడ్ల శ్రీనివాస్ ప్రభుత్వాన్ని కోరారు. డిమాండ్ల సాధన కోసం విఆర్‌ఎల ఐక్య కార్యాచరణ సమితి పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న సమ్మెలో భాగంగా బాలాపూర్ మండల తహశీల్దార్ కార్యాలయం వద్ద స్థానిక విఆర్‌ఎలు చేపట్టిన సమ్మెకు ఆయన హాజరై సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా గుడ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ విఆర్‌ఎలకు అండగా బిఎస్‌పి ఉంటుందనీ ఇప్పటికే రాష్ట్ర పార్టీ సమన్వయకర్త డాక్టర్ ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ విఆర్‌ఎల న్యాయమైన డిమాండ్లను తీర్చాలని ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వెంకటాచారి, గట్టు వెంకటేష్, గుడ్ల జ్ఞానేశ్వర్, రాజేష్, విక్రం తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రావణ మాస బోనాలు



ఓల్డ్ మలక్‌పేటలో అమ్మవారి తొట్టెలను ఊరేగిస్తున్న దృశ్యం

**మలక్‌పేట, ఆగస్టు 1 ప్రభాతవార్త :** ఓల్డ్ మలక్‌పేటలో మహంకాళి అమ్మవారి దేవాలయంలో ఘనంగా శ్రావణ మాస బోనాలు జరిగాయి. పోతరాజుల విన్యాసాల మధ్య తొట్టెల ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించి అమ్మవారికి బోనం సమర్పించారు. పెద్ద ఎత్తున మహిళలు విచ్చేసి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మల్లికార్జున ఆలయ చైర్మన్ చౌకి రవికుమార్, దళిత మోర్చ డివిజన్ అధ్యక్షుడు ఎం.రాజ్‌కుమార్, బిజెపి గ్రేటర్ కార్యదర్శి చీపురు రాజారావుగౌడ్, నాయకులు జీవన్, డాక్టర్ లక్ష్మణ్, సరళ, నర్సింహ్మ, శివమ్మ తదితరులు పాల్గొన్నారు.